## అంకితము

### మా తండ్రి, తాత, ముత్తాతలు, భార్యాసమేతులుగా
### శ్రీపతి పాదపద్మాలు పొందెదరు గాక



సీ॥ ప్రపితామహుడు నాకు పరగె మృత్యుంజయ
సోమయాజులుగారు చొక్కముక్తి
దివికి సుబ్రహ్మణ్య దీక్షితులుంగారు
మా తాత వడిజేరె మహిని వీడి
చదివించు గతిలేక సంతబేహారియై
రామకృష్ణుడు తండ్రి లక్షలెన్నె
ఎంటెక్కు చదివియు ఇంకొక వ్యాపారి-
గామారి గడియించి కంటికీర్తి

ఆ.వె॥ రోగమొచ్చి బ్రతుకు రోతయై కుందితిన్
వేంకటేశుడేలె పెన్నిధాయె
కవితవ్రాయ నేర్పె ఘనమైన యీకృతి
అంకితమ్ము పెద్దలందరికిని.





(సంపుటి - IV)



# హరి సేవకే వేంకటేశ మకుటం

ఇది

### అన్నమయ్య, పెదతిరుమలయ్య, చిన తిరుమలయ్య
### సంకీర్తనలకు అమరవాది భావపరిమళం

శ్రీరస్తు

శుభమస్తు అవిఘ్నమస్తు



# హరి సేవకే వేంకటేశ మకుటం

## అన్నమయ్య, పెద తిరుమలయ్య, చిన తిరుమలయ్య సంకీర్తనలకు

# భావ పరిమళం

రచన

**అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు**

M.Tech.





## హరి సేవకే వేంకటేశ మకుటం

(సంపుటి - IV)

మొదటి ప్రచురణ

**జూలై 2014**

రచన

**అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు**

వెల : **అమూల్యం**

ప్రతులకు :

ఫ్లాట్ నెం. 5, ప్లాట్ నెం. 61, సిద్ధార్థ నగర్,

హైదరాబాద్ - 38. ఫోన్ : 093930 21360

డి.టి.పి. ప్రింటింగ్ :

**కె.వి.ఆర్.**

98495 79345

సీ॥ హరిసేవకే వేంకటాధిపు మకుటమ్ము
చేబూనికైతలు చెప్పినారు
అన్నమయ్య, అతనికాప్తుడౌ మనుమందు,
సుతుడు అదేబాట జొచ్చినారు
తాళ్ళపాక కవులు తరియించుటే కాదు,
మనబోంట్లకును ముక్తి మార్గమడిరి
కొడుకులన్నను తండ్రి కోర్కె దీర్చెడివారె
కొరివిబెట్టుటకేమి కొయ్యచాలు

ఆ.వె॥ అచ్చతెనుగు కవిత అవగతమగుటకు
నేటితరమువారి నేర్పు మితము
భావపరిమళంబు భక్తితో జెప్పితిన్
దిక్కునాకు నీవె తిరుమలేశ!

తరళము :
తరతరాలుగ శ్రీనివాసుని తాతతండ్రులు మన్మడున్
కొలుచుటే అపురూపమందురు కార్యదీక్షగ కైతలన్
విలువతగ్గక కీర్తనంబులు వేంకటామకుటంబుతో
చెలువమెప్పగ చెప్పిరందుకె చేరి బొందిరి మోక్షమున్.

కం॥ హరిసేవకె యీ దేహము
హరిజేరని జన్మయేల అది వ్యర్థమురా
హరిజెప్పని చదువెందుకు?
హరిగొల్వని చేతులేల హత్యలకొరకా?

మ॥ ఇదియే చక్కటి బాటరా కొలువనై ఈశున్ జగన్మోహనున్
పదిలంబైనది పెద్దలెందరొ ఇదే బాటంది వైకుంఠమున్
ముదమొప్పన్ గడియించిరయ్య వినుడీ ముద్దార నాకున్ హరే
అదిగో ఈ మకుటంబెరక్షయనుచున్ అందింతు మీకీ కృతిన్.





# హరి సేవకే వేంకటేశ మకుటం

(సంపుటి - IV)

అన్నమయ్య, పెదతిరుమలయ్య, చినతిరుమలయ్య సంకీర్తనలకు
భావ పరిమళం

## విషయ సూచిక


| క్ర.సం. | కీర్తన వివరము | సంపుటము/సంఖ్య | పేజి |
|---|---|---|---|
| 1. | అంతదొడవారమా అందుకు | 6/83 | 13 |
| 2. | అలిగితినా నీతో అవుగాదని | 23/491 | 51 |
| 3. | అలుగకువమ్మా నీవాతని | 9/300 | 39 |
| 4. | అహో సాధుతవాగమనం | 6/24 | 14 |
| 5. | అద్దములో జూచుకొవే | 29/527 | 48 |
| 6. | ఆడువారు కడుగోపులవుట | 17/31 (పె.శృ) | 25 |
| 7. | ఇన్నియుగొత్తలు దోచె నింతలోనె | 6/94 | 24 |
| 8. | ఇన్నియును దగగలిగెనీయింతికి | 6/87 | 21 |
| 9. | ఉయ్యాలమంచముమీదనూచి | 5/171 | 38 |
| 10. | ఎక్కడిపరాకుననోయిందాకా | 10/74 (చి.శృ) | 8 |
| 11. | ఎట్టుసింగారింతుమమ్మ | 9/90 | 44 |
| 12. | ఏమిచిత్రంబేమి మహిమలు | 15/215 (పె.అ.) | 26 |
| 13. | ఏమౌతనెఱగనీవేమనే | 9/53 | 41 |
| 14. | ఏలరా కృష్ణుడా | 10/59 (చి.శృ) | 6 |
| 15. | ఏలా యీయనుమానము | 5/306 | 33 |
| 16. | ఔనోకాదో నీవానతీయవమ్మ | 9/35 | 38 |
| 17. | కన్నెవయసు మీదనే ఘనజవ్వనము | 20/262 | 49 |
| 18. | కలలోనె యిరువురము నలిగివేగ | 5/21 | 31 |
| 19. | కొమ్మనీవెవో కోపింతువతడు | 6/82 | 12 |
| 20. | కోడెగాడు వీడెవీడె గోవిందుడు | 9/257 | 43 |
| 21. | గోవిందామేల్కొనవయ్యా | 10/57 (చి.అ) | 4 |
| 22. | చందురుడు నుదఇంచె జల్లున | 23/566 | 50 |
| 23. | చంచలమతులకు దెలియునె | 10/15 (చి.అ) | 2 |

| | | |
|---|---|---|
| 24. చక్కనిబోయజవరాలు మించు | 6/118 | 23 |
| 25. చాలామేలుదిరాయీ బాలామణి | 10/84 (చి.శృ) | 9 |
| 26. చాలుజాలు నీతో జాణతనాలా | 9/72 | 40 |
| 27. చెల్లబో అలుగనేడు సిగ్గుగాదా | 5/183 | 35 |
| 28. తనువె యిక్కడ కానితలపెల్లా | 10/16 (చి.శృ) | 5 |
| 29. తెలియదెవ్వరికిని దేవదేవేశ | 6/71 | 17 |
| 30. నారాయణ నీవే నాథుడవైతివి | 15/111 (పె.అ) | 28 |
| 31. నిన్నుబాసినయట్లు నెలతకు | 6/84 | 18 |
| 32. నీకువలచిన సతికి నెగులు | 6/79 | 22 |
| 33. నీతోనేబంతమాడేనా | 13/190 | 46 |
| 34. నీవంటి గుండెలేదు నిర్మోహి | 14/360 | 47 |
| 35. నెఱజాణతనము నీకింత కలదట | 6/76 | 20 |
| 36. పనిలేదు పాటలేదు భ్రమించి | 15/176 (పె.అ) | 30 |
| 37. ప్రాయంపు మదములే పరిణామము | 6/2 | 10 |
| 38. బ్రహ్మపూజించే రఘుపతి విభీషణు | 15/125 (పె.అ) | 27 |
| 39. మఱవకుమీ మాట మతిలోనను | 20/424 | 52 |
| 40. మఱివేళలేదా మనసునిలుపరా | 14/130 | 45 |
| 41. మనసే వశమైతేగా మరిమీదటి | 10/21 (చి.అ) | 3 |
| 42. మునుకొని పయిడికి ముద్రవాసిగతి | 15/230 (పె.అ) | 29 |
| 43. రాకురాకుమయ్యామాతో రంతులింతేలా | 6/170 | 11 |
| 44. రాయడికాదు గదమ్మ రంతుసేసీని | 5/325 | 32 |
| 45. లలితాంగి యౌవనము లావణ్యముల | 6/161 | 16 |
| 46. వంచన ప్రియములవారే కాక | 5/158 | 36 |
| 47. వలపేమిదాగునా వన్నెకాడ | 10/35 (చి.శృ) | 7 |
| 48. వినవమ్మ యశోద గోవింద కృష్ణుడు | 9/173 | 42 |
| 49. శ్రీపతిపురనాయకా జయ | 10/51 (చి.అ) | 1 |
| 50. సింగార రాయనిదిట్టీ జెంచెత | 5/146 | 34 |
| 51. సతికి నిటువంటి రాజసమేల | 6/121 | 19 |
| 52. సదయమానసమానస సరోజాత | 6/162 | 15 |






# ప్రార్థన

కం॥ శ్రీకాంతుని కీర్తించుట-
కే కద! యీ జీవనంబు క్రీడించుటకా?
మాకేల కీర్తి, సిరులును
మాకీ హరిసేవ చాలు మన్నన యిదియే.

ఉ॥ చేకొని వేంకటేశ్వరుని సేవగకైతలు చెప్పినారహో!!
ఆకడతాళ్ళపాక కవులైన మహాత్ములు అన్నమయ్యకున్
సోకగు పుత్రపౌత్రులతిసొంపుగ ఆమకుటంబుతోడనే
శ్రీకరువేంకటేశ్వరుని సేవతరించిరి మాకు భాగ్యమై.

ఆ.వె॥ భావపరిమళంబు పరిఢవిల్లుచునుండ
తాళ్ళపాక కవులు తలలువూప
నేటివారి కొరకు నీటుగ జెప్పెద
చదివి దీనిమెచ్చ సంతసింతు.

తే.గీ॥ మొదట శృంగార కవితలు ముగ్గురున్ను
చెప్పినవి ఎన్నుకొంటిని చెలువమొప్ప
ఆర్తితీరక అధ్యాత్మ కీర్తనముల
జెప్పితరియింతు వేంకటశిఖరవాస!

చం॥ సరసుడు వీడు శ్రీవిభుడు జన్మల భాగ్యప్రదాత తానెయా
తిరుమల చేరియొక్కపరిదీవెనలందుము మంచిదారిరా
పరిమితమైన జీవితము బాధ్యత తీరదు చావుదాక,నా
తెరవును మీరు చేకొనుడుదేనికి శంకలు నమ్ముడీహరిన్.

ఇందులో 52 కీర్తనల (సంపుటి–IV)ను ఆడియో సి.డి.గా వెలువరించాలని నా ఆకాంక్ష. నా మిత్రులు విన్నకోట మురళీకృష్ణగారి సహకారంతో నా కోరిక తీరుతుందని నా ఆశ.

ఎందుకంటే అవన్నీ ఆయన స్వరపరచి, పాడి, పాడించిన అన్నమయ్య.

పెదతిరుమలయ్య, చినతిరుమలయ్య సంకీర్తనలు. సంస్కృత కీర్తనలకు డాక్టర్ శంకర చంద్ర పవన్ గారి సహాయం అనితర సాధ్యము. వీరిరువురికి కృతజ్ఞతాపూర్వక సుమాంజలి.

నా ఇతర రచనలన్నీ భగవద్సేవాభాగమే. అవన్నీ Google Site లో geetadeeksha.com లో లభ్యమవుతాయి

**తిరుమల తిరుపతి దేవస్థానములవారికి సదా కృతజ్ఞుడను**







# తొలిపలుకు

శ్రీవేంకటేశ్వర అనే మకుటంతో 32000 కీర్తనలు చెప్పిన ఘనుడు తాళ్ళపాక అన్నమాచార్యులవారు. రమారమి 75 సంవత్సరాలు ఆ యజ్ఞం నిర్వహించారాయన. ఆయన కీర్తన వినని శ్రీహరిభక్తుడు వుండడు. మన దురదృష్టంకొద్దీ 20 వేల కీర్తనలు లభ్యంకాలేదు.

ఆయన తదనంతరం వారి సుపుత్రుడు పెదతిరుమలాచార్యులవారు తండ్రిమాట ప్రకారం అదే మకుటంతో తానూ అనేక కీర్తనలు చెప్పారు. అంతేకాదు తాతగారివద్దనే పెరిగి ఆయన వారసత్వంగా సాహిత్య పరిమళం అందుకొన్న ఒక సుపుత్రుని కన్నాడు. ఆయనే చినతిరుమలాచార్యులవారు. ఆయనా తాతగారివలె కీర్తనలు చెప్పి తిరుమలేశుని సేవించారు. కొడుకుల కవితా శైలి పరంపరగా సాగింది. ఇదివరలో అన్నమయ్య – అనుయాయులు అనే పేరుతో అన్నమయ్య భక్తి కీర్తనలు, పెదతిరుమలయ్యవి శృంగార కీర్తనలు, చినతిరుమలయ్యవి వైరాగ్య కీర్తనలను పరిచయం చేసే భాగ్యం ఆ తిరుమలేశుడు నాకు కల్పించాడు. దానిని టి.టి.డి. వారు ముద్రిస్తున్నారంటే, నా జన్మ చరితార్థమైనదని భావిస్తున్నాను.

నేడు అదే స్ఫూర్తితో వారి ముగ్గురి శృంగార కీర్తనలకు భావపరిమళం అందిద్దామనే తలంపు ఆ స్వామే నాకు

కలిగించాడు. దాని ఫలితమే ఈ నా ప్రయత్నం. ఇదే కోవలో భక్తి, వైరాగ్య కీర్తనలు చెప్పాలని నా ఆకాంక్ష. ఆపైన శ్రీనివాసుని దయ నా ప్రాప్తము.

నా భావన యేమంటే ముగ్గురిలోనూ పెదతిరుమలయ్య కవిత కొంచెం అధిక శ్రమపడునట్లు చేస్తుంది. అన్నమయ్య కవిత అలవోకగా వుంటుంది. కాకపోతే మనబోటి నవీన యుగమువారికి అన్నమయ్య కవిత కష్టమే. నాచేత తిరుమలనాథుడు చెప్పించిన దీనినాస్వాదించండి. నేను వాడిన భాష తేలికపాటిదే అవటంవల్ల మీకు నచ్చుతుందని ఆశిస్తాను.

పెదతిరుమలయ్య భార్య తిరుమలాంబ. ఈయన భగవద్గీతను తెలుగు వచనముగా చెప్పాడట. హరివంశాన్ని ద్విపద కావ్యంగా రచించాడట. రెండవది నేడు లభ్యమగుటలేదు. ఆయన "సంకీర్తనా లక్షణము" అనే గ్రంథమునకు వాఖ్య రచించినట్లు చినతిరుమలాచార్యులవారు పేర్కొనినాడు. ఈయనకు అనేక బిరుదులున్నాయట. వేదాంతాచార్య, కవితార్కిక కేసరివంటివి సుప్రసిద్ధములు.

ఆ దంపతుల సుపుత్రుడే చినతిరుమలాచార్యులవారు. ఈయనకు అష్టభాషా చక్రవర్తి అని బిరుదున్నది. తన తాతగారు అన్నమాచార్యుల శిక్షణలో పెరిగిన చిన తిరుమలయ్య తాతగారి కీర్తనలు జీర్ణించుకొని పెద్దవాడైనాడు. సంగీత సాహిత్యాలు రెండిటిలోనూ దిట్ట. ఈయన నేటి గుంటూరు సమీపమునగల





మంగళగిరి నరసింహస్వామిని దరించినట్లు ఒక శాసనముద్వారా తెలియవచ్చుచున్నది. ఈయన కీర్తనలద్వారా నేటి చిత్తూరు, అనంతపురం, కడప, కర్నూలు, నెల్లూరు జిల్లాలోకూడా విశిష్టాద్వైతమత ప్రచారానికై దర్శించి పెక్కు అర్చావతారములను చినతిరుమలయ్య దర్శించి కీర్తనలు చెప్పినాడు. అలమేలుమంగాపురంలోని పెక్కు జీర్ణమైన ఆలయములను పునరుద్ధరించినాడు.

"హరి సేవకే వేంకటేశ మకుటం" అనే ఈ నా రచనలో మొదటి రెండవ సంపుటములలో శృంగార కీర్తనలు మూడు నాలుగు సంపుటములలో వైరాగ్య కీర్తనలు ఐదు, ఆరవ సంపుటములలో భక్తి కీర్తనలు చెప్పాలని నా ఆకాంక్ష. ఆపైన తిరుమలేశుని దయ నా ప్రాప్తము. తాత తండ్రి మనుమడి కవితా ఒరవడి పాఠకుల మన్నన అందుకొనేట్లు ఏడుకొండలయ్య దీవెనలకు ఆశపడుతున్నాను. లేకున్న ఇంత బృహత్ ప్రయత్నం నెరవేరేనా?

తండ్రుల దీక్షను తనయులు కొనసాగించటమా!! ఈ నవీన కాలంలో తండ్రుల మాటవినే పుత్రరత్నాలే, రత్నాలవలె అల్పసంఖ్యలో వున్నారు. ఇక తండ్రి దీక్ష తమకేం పని అనుకోవడంలో ఆశ్చర్యమేముంది? కాని పెద తిరుమలయ్య వంటి కొడుకులు, చినతిరుమలయ్యవంటి మనుమలువున్న అన్నమయ్యలు నేటియుగంలో కానరారు. అందుకే నాఈ భగవత్సేవకు ఈ పేరు సరిపోతుందని భావిస్తాను.





















సంఖ్య : 57 సంపుటము : 10 పుట: 32 రాగం : భూపాళం

**4 గోవిందా మేల్కొనవయ్యా**
**కావించి భోగము కడమా నీకు** ॥పల్లవి॥

**కమలజ చల్లనికాఁగిటఁ దగిలి**
**సమరతిఁ బాయఁగఁ జాలవూ**
**కమలభవాదులు కడు నుతియింపఁగ**
**విమలపుశయనము విడువగ లేవు** ॥గోవిందా॥

**భూసతితోడుత పొందులు మరిగి**
**వేసర విదె నీ వేడుకలా**
**వాసవముఖ్యులు వాకిట నుండఁగ**
**పాసి వుండ నని పవళించేవూ** ॥గోవిందా॥

**నీళామనసిజలీలలఁ దగిలి**
**నాలితోడ మానఁగ లేవూ**
**వేళాయను శ్రీవెంకటనాథుఁడ**
**పాలించి దాసుల బ్రతికంచఁగనూ.** ॥గోవిందా॥

**భావ పరిమళం :**

చినతిరుమలయ్య ఆలపించిన ఈ అధ్యాత్మ కీర్తననాస్వాదించండి. తాతగారి కవితా ధోరణి ప్రతిఫలించే ప్రక్రియ గమనించండి. ఓ గోవిందా మేలుకోవయ్యా! మహానుభావా! నీకు మేమూ కొన్ని సేవలు చేసికొనవలె. నీకు భోగములు మేమిచ్చేదేమిటి? నీ భోగములకు తుది అనేదే లేదు. కమలోద్భవి యైన కమలాదేవి యొక్క చల్లని కౌగిట్లో సమరతి వోలలాడి ఆమెను వదలలేకున్నావు. కమలసంభవుడైన బ్రహ్మదేవుడు నిన్ను అధికంగా నుతిస్తుంటే నిర్మలమైన ఆదిశేషుని తల్పమును వీడలేకున్నావు. భూదేవి పొందులు మరిగిన నీకు ఎంతకీ విసుగు కలుగదు. పైగా అది కడుంగడు వేడుకనీకు. ఇంద్రాది దేవతలు నీ వాకిట నిలిచి నీకోసం వేచివున్నా నీ పడకను వదలలేనని పవ్వళించేవు. ఇలాగైతే యెలా స్వామీ! మాపై దయతో మేల్కొనవయ్యా నీ మనసు నాక్రమించిన నీలాదేవిని తగులుకొని పరవశము నొంది ఆ సుఖమును వదలలేవు. ఓ శ్రీవేంకటనాథా! వేళ మించిపోతున్నది స్వామీ! మాబోటి నీ దాసుల్ని బతికించటానికైనా నీవు మమ్ము పాలించక తప్పదు. అందుకైనా నిదురలేవవయ్యా!

★ **వాసవుడు** – ఇంద్రుడు ★ **నాలితోడ** – పరవశముతో





సంఖ్య : 51 సంపుటము : 10 పుట: 29 రాగం : మాళవిగౌళ

**1 శ్రీపతిపురనాయకా జయచింతితాభీష్టదాయకా** ॥పల్లవి॥

**వున్నతోన్నతవిగ్రహా దాసోపరిస్థానుగ్రహా**
**సన్ను తామరసుగ్రహా సామవదపరిగ్రహా** ॥శ్రీప॥
**జానకీ ప్రియకారకా శివసాధితాఖిలతారకా**
**మానుషాహితమారకా మామకాఘనివారకా** ॥శ్రీప॥

**శ్రీవెంకటనాథరూపకా సంచితరఘుకులదీపకా**
**భావసంతోషప్రాపకా అభంగమంజులచాపకా.** ॥శ్రీప॥**51**

**భావ పరిమళం :**

తాళ్ళపాక చినతిరుమలాచార్యులవారు చెప్పిన ఈ గీర్వాణి సంకీర్తనతో ఈ సంపుటి – IV ప్రారంభించడం నా అదృష్టం. తన తాతగారైన అన్నమాచార్యులు, తన తండ్రి పెదతిరుమలాచార్యులవలె ఈయనా సంస్కృత ఆంధ్ర, జానపద తెలుగు కవితలు చెప్పటంలో దిట్ట. ఇది శ్రీరామచంద్రునిపై జెప్పిన గీర్వాణి కీర్తన. తన తాత తండ్రుల వలె ఈయనా అన్ని అర్చామూర్తులు, శ్రీవేంకటేశ్వరుడే అనే భావనతోనే, అదే మకుటంతో కీర్తనలు చెప్పారు. తాత తండ్రుల కంటే బహు తక్కువకాలం జీవించిన చినతిరుమలయ్య వారి కీర్తనలను రాగిరేకులపై చెక్కించటంలో గణుతికెక్కాడు. ఇక ఈ కీర్తనాస్వాదిద్దాం. శ్రీపతిపురమైన వైకుంఠమునకు అధినాయకుడవైన ప్రభూ! నీకు జయమగుగాక! నీవు కోరుకొన్న అభీష్టములను ప్రసాదించువాడవు, అత్యున్నతమైన స్వరూపము కలవాడవు, హృదయంలో దాసులయందు అచంచలమైన అనుగ్రహం కలవాడవు, సన్నుతించే దేవతలపై గొప్ప అనుగ్రహమును ప్రసాదించువాడవు, సామవేద గానమును ప్రీతిచే పరిగ్రహించువాడవు. ప్రభూ! నీవు జానకీదేవికి ప్రియమును చేకూర్చువాడవు, పరమశివునిచే సాధించబడిన తారకమంత్ర స్వరూపుడవు., మానవులకు అహితము ధ్వంసము చేయువాడవు. మా యొక్క పాపములను నివారించువాడవు ప్రభూ! శ్రీవేంకటనాథుని రూపములో కలియుగ పరిసమాప్తి వరకు వెలయువాడవు, రఘుకులమును తరతరములకు దీపకుడైనావు, భావనా రహిత సంసార సాగరమును దాటు సంతోషమును ప్రసాదించు వాడవు, అభంగమైన కోదండధనుస్సు కలవాడవు. ప్రభూ! అట్టి నీకు సర్వదా జయమగుగాక!

★ **శ్రీపతిపురము** – వైకుంఠము
★ **సామవదపరిగ్రహా** – సామవేదము చెప్పగా ప్రీతితో వినువాడు

సంఖ్య : 15 సంపుటము : 10 పుట: 9 రాగం : గుజ్జరి

**2 చంచలమతులకుఁ దెలియునె సాత్వికధర్మములు**
**మంచమునీడవలె బహుమార్గములై తోఁచున్ ॥పల్లవి॥**

**తీపుల అల్పపుచదువుల తెలి వేలా కలుగు**
**కాపై మిడుఁగురుఁబురువులఁ గడచునె చీఁకట్లు**
**పైపై ప్రాకృతద్రిష్టికి పర మేలా కలుగు**
**పాపము కనుమాయలవలె భ్రమయించుఁ గాక ॥చంచ॥**

**కొద్దెరఁగని జడునికి సద్గుణ మేలా కలుగూ**
**అద్దము చిలు ముబ్బినక్రియ అజ్ఞానవము వొడమున్**
**నిద్దము కామాతురునకు నిజమేలా తెలియూ**
**వద్దనె యండమావులవలెఁ దోఁచుఁ గాక ॥చంచ॥**

**అనువుగ నక్షయపుణ్యము అది యేలా చెడును**
**పెనఁగెటి తనవీడవలెనె పెడవాయదు యెపుడు**
**ఘనుఁడగుజీవుఁడు శ్రీవెంకటనాథునిఁ గని (నె?) నా**
**పనివడి రత్నము సానఁబట్టినగతిఁ జెలఁగున్ ॥చంచ॥15**

**భావ పరిమళం :**

చినతిరుమలయ్య వినిపిస్తున్న ఈ చక్కటి అధ్యాత్మ కీర్తన నాస్వాదించండి. సాత్విక స్వభావము కలిగినవారు ఆచరించేధర్మము లోకోపాకారానికి, తద్వారా భగవత్ప్రీతికి ఉపయోగపడుతుంది. చంచల స్వభావంకలవారికి మంచితనం, సాత్త్విక ధర్మం యెట్లా తెలుస్తుంది? మంచము కూడా ఎండలో నీడనివ్వవచ్చును. కానీ ఆ నీడ యెంత చంచలమైనదంటే ఆ నీడవల్ల ఏ ఉపయోగమూ వుండదు. అది సదా మారుతూనే వుంటుంది. పొట్టకూటికోసం చదివే మిడిమిడి అల్పపు చదువులవల్ల భగవంతుని తెలిసే తెలివి యెలా కలుగుతుంది? మిణుగురు పురుగుల కాంతి కంటికి కనబడుతుంది కానీ చీకట్లను పారద్రోలగలదా? ప్రతిదీ ప్రాకృత దృష్టితో చూచే వ్యావహారికి "పరము"పై కోర్కె కలుగుతుందా? వారు పాపము కలిగించే మాయలో తగిలి భ్రమలకు లోనై పాపులుగానే మిగిలి పోతారు. హద్దు తెలియని మూర్ఖునికి, సద్గుణములబ్బుతాయా? అద్దమునకు చిలము పట్టుకొంటే ప్రతిబింబాలు చక్కగా కనుపిస్తాయా? ఆరితేరిన కామాతురుడు నిజము గ్రహించగలడా. ఎండమావులలో దొరికే నీటివలె ఇవన్నీ జరిగే పనులు కావు. అనువుగా నిరంతరం పుణ్యకార్యములే చేసినవానికి అక్షయమైన పుణ్యం, వెంటవెంట వచ్చే నీడవలె యెల్లప్పుడూ తోడుంటుంది. ఘనుడైన జీవుడు శ్రీవేంకటేశ్వరుని చూడగలిగాడంటే సానబట్టిన రత్నమువలె ప్రకాశిస్తుంటాడు.

★ **నిద్దము** – ఆరితేరిన ★ **తీపుల** – పొట్టతీపికి



హరి సేవకే వేంకటేశమకుటం

సంఖ్య : 21 సంపుటము : 10 పుట: 12 రాగం : మాళవిగౌళ

**3 మనసె వశమైతేఁగా మరి మీఁదటిపనులు**
**తనువులోపలి హరిదయ యింతె కాకా ॥పల్లవి॥**

**వొద్దనె పుత్రమిత్రాదు లువ్విళ్లూరించఁగాను**
**అద్దొ వైరాగ్య మేమి ఆటపాటలా**
**కొద్దిలేనివిషయాలు గుంపు గూడు కుండఁగాను**
**వద్దని కడకుఁ దోయ వశ మవునా ॥మన॥**

**వొయ్యనె ధనధాన్యాలు వొడ్డుకొని వుండఁగాను**
**అయ్యో సుజ్ఞానము లల్లాడఁబడెనా**
**గయ్యాళికోరిక లెల్లా గమిగూడ కుండఁగాను**
**పుయ్యక దూలయాసలఁ బోఁదోల వసమా ॥మన॥**

**పల్లదపుటాఁక లిది పాయక వుండఁగాను**
**చెల్లఁబో వోరుపు లింత చెడఁబోయవా**
**నల్లని శ్రీవెంకటనాథుఁడె యందరికిని**
**తల్లి దండ్రియై కావఁగా తప్పువాసెఁ గాకా. ॥మన॥21**

**భావ పరిమళం :**

చినతిరుమలయ్య ఈ అద్యాత్మ కీర్తనలో మనసు వశమైతే గాని ప్రాపంచిక పనులను నిబద్ధతతో చేయలేము అంటున్నారు. మరి ఇది హరికృపలేక జరిగే పనికాదు. ఇక ఆ హరి యెక్కడవున్నాడయ్యా? మన అంతర్యామిగా వున్నాడు. ఆ హరి రమావల్లభుడైన శ్రీహరే. కాని నియంత్రించ లేకపోతే వాడే హరి (కోతి). నీవుతోడు అనుకొంటున్న పుత్రులు, మిత్రులు నిన్ను పరవశంతో ఉవ్విళ్ళూరిస్తూనే వుంటారు. వాళ్ళు ఛీ! వైరాగ్యందేనికిరా? జీవితం ఆటపాటలతో గడుపు అంటుంటారు. ఈ విషయవాంఛలకు కొద్ది అనేదే వుండదు. అవి గుమిగూడకుండా వద్దని చివరికి తోసివేయడం సాధ్యమయ్యే పనేనా? ధనధాన్యములను సముపార్జిస్తున్నంతకాలం వాటిని మితితో అడ్డుకొని నియంత్రించే నిబద్ధత వుండాలి. అయ్యో! ఆ సుజ్ఞానం అంత తేలికగా వస్తుందా? రట్టడి కలిగించే కోరికలన్నీ గుమికూడ కుండా వుంటాయా? చెప్పండి. ఆ కోరికలు ఆశలను పెంచుతూనే వుంటాయి. అవి అడియాశలైనా వాటిని మనిషి పోద్రోలలేడు. అది సాధ్యమా? నిద్ర లేచింది మొదలు దరిద్రపుగొట్టు ఆకలిని అంటించాడే ఆ దేవుడు. అమ్మయ్యో !! ఓర్పు నశింపజేసి అది మనిషిని చెడగొట్టదా? నల్లనయ్య శ్రీవెంకటేశ్వరుడు మనందరికీ తల్లీ, తండ్రీయై కాపాడుతున్నాడు. లేకపోతే ఈ వానరుడివంటి నరుడు తప్పుదారి బట్టడా?

★ **ఒయ్యనె** – అతిశయించిన ★ **పల్లదపు** – వ్యర్థమైన

సంఖ్య : 74 సంపుటము : 10 పుట: 42 రాగం : ముఖారి

**8 ఎక్కడి పరాకుననోయిందాఁ కానుండెఁగాక**
**మక్కువ నాపై బత్తిమానలేఁడె వాఁడు** ॥పల్లవి॥

**పాయరాని వలపులు పక్కనఁ దలఁచుకొంటే**
**రాయా మనసు గరఁగ కేమే**
**వో యమ్మలాల నావుంగరము చూపరమ్మ**
**వేయేల తా నిప్పుడే విచ్చేసీ నీడకే** ॥ఎక్కడి॥

**వూనినట్టిసరసాలు వూహించుకొంటేను**
**మానా దేహము తమకించ కేమే**
**మానినులాల వొక్క మాఁట విన్నవించరమ్మ**
**తానె వచ్చి నన్ను సంతస మందించీనే** ॥ఎక్కడి॥

**సేదదేరే చనువులు చిత్తమునఁ దగిలితే**
**దూదేవయ సేమి వూదితేఁ బోను**
**ఆదెస మండెమురాయఁ డైన శ్రీవెంకటనాథుఁ**
**డాదరించి నన్నుఁ గూడె నతిమోహముననూ.** ॥ఎక్కడి॥

**భావ పరిమళం :**

చినతిరుమలయ్య చెప్పిన ఈ శృంగార సంకీర్తనలో చెంచులక్ష్మి తన చెలియలతో నరహరి తన వలపురేడు అని, తనపై మక్కువ, భక్తి శ్రద్ధలు కలవాడనీ, ఇప్పటిదాకా తానంటే పరాకు చిత్తగించినా, అతగాడు తనవాడేనంటున్నది. ఓ అమ్మలారా! ఒక పక్కన వదలలేని నా వలపులు తలచుకొంటే, ఆ నరహరి 'రాయా' యేమే? వానిమనసు యెందుకు కరుగదే? అట్లా కాకపోతే అతగాడు నాకిచ్చిన ఈ ఉంగరం చూపండే. అంతెందుకు దీన్ని చూడగానే, వెంటనే నాదగ్గరకి వచ్చి వాలడా యేమే? ఓ మానినులారా! మామధ్య జరిగిన సరసాలను నెమరువేసికొంటే, అతగాని దేమము పులకించకపోవటానికి తానేమన్నా 'చెట్టా' యేమిటే? మీరు వెళ్ళి వానికి ఒక మాట విన్నవించండే. నేను వానివెంట పడలేదు. అతగాడే వచ్చి నన్ను సంతోషపెట్టాడు. అతగాని చనువులు, నాకు సేదదీరుస్తాయే (అలసట పోగొడతాయే). అవి మనస్సులో నాటుకొని పోయాయి. పోనీ వయస్సు దూదివలె వూదితే యెగిరిపోతుందా యేమే? అదిగో అటు చూడండి. నా నరహరి, మండెము రాయుడే. వాడే తిరుమల శ్రీవేంకటేశ్వరుడు కూడా. వాడు నన్ను ఆదరించి, అతిమోహముతో కూడినాడే.

★ **పరాకు** – పరవశత్వము ★ **వూనినట్టి** – వహించిన





సంఖ్య : 16 సంపుటము : 10 పుట: 32 రాగం : భైరవి

**5 తనువె యిక్కడఁ గాని తలఁ పెల్లా నక్కడనె**
**మనసులో నాపె నింక మాననైనఁ గలవా** ॥పల్లవి॥

**మాయింటాడ నిచ్చకపు మాఁట లాడే వింతే కాక**
**వోయీ నీ వాపెఁ బాసి వుండ నోపేవా**
**ఆయెలే మాముందటను అసము దించవు గాక**
**చేయార నీవె యాపెను చెనక కుండేవా** ॥తనువె॥

**మానలేనివానివలె మన సరసేవు గాక**
**ఔనా ఆపె వడ్డించ కారగించేవా**
**తేనెలమాఁటలఁ దరితీపులు సేసేవు గాక**
**కానీలె యాపెపై తమకమె పట్టఁగలవా** ॥తనువె॥

**యీపొద్దుకు నాకాఁగిలి యింపాయ ననేవు గాక**
**పో పో నీవాపెఁ దలపోయ కుండేవా**
**కాపాడి నన్నును శ్రీవెంకటనాథ కూడితివి**
**మాపొందు లాపెవద్దను మఱవఁగఁ గలవా.** ॥తనువె॥

**భావ పరిమళం :**

చినతిరుమలయ్య భావనా సుందరి శ్రీవల్లభుని వలపును పొందనిదే జీవించలేనంటున్నది. నిజమే... స్వామి శ్రీదేవిని విడువలేడు. స్వామీ! నీవు నాదగ్గరకు వస్తే తనువే ఇక్కడ వుంటుంది కాని మనసులో ఆమెను మాననైనాగలవా? మానలేవు. మా ఇంటి దగ్గర యేవో ఇచ్చకపు మాటలు చెబుతావు. అంతేమరి. ఓయీ! నిజం చెప్పు. నీవామెను వదలి వుండగలవా? అనాదరణ మాముందు ప్రదర్సిస్తావు. కాని దర్పము ఆమె చూస్తున్నప్పుడు ప్రదర్శిస్తావు. నీ చేతులు ఆమెను తాకుటకు వువ్విళ్ళూరుతుంటే, నీవు బుద్ధిగా వుంటావా? మమ్మల్ని వదలలేని వానివలె సరసనే వుంటావు. ఔను కాని నీవు ఆమె వడ్డించకుంటే మెతుకైనా ముట్టవు కదా! తేనెలూరే తీపి మాటలతో మమ్ము సంతోషపెడతావు నిజమే. కాని ఆమెపై నీ తమకము మానుకోగలవా? ఈ పూట నా కౌగిలి పసందుగా వుందంటున్నావు. పోపోవయ్యా! నీవామె ఆలోచనలనే వదలలేని వాడివి. కానీ యేమి చేయను? నీవు నన్నును కాపాడిన వేంకటనాథుడవు. నన్ను కూడినావు. నీవు ఆమెవద్దనున్నా, నన్ను మరువగలవా?

★ **ఆయలె** – అనాదరణ ★ **అసము** – దర్పము

సంఖ్య : 59 సంపుటము : 10 పుట: 34 రాగం : బౌళి

**6 ఏలరా కృష్ణుఁడా** **॥పల్లవి॥**

**పగటూ మాఁటల నొగరూ దోఁచఁగ**
**మగనాలిని నన్ను నగఁ జూచే వేరా** **॥ఏలరా॥**

**కొనబూ విటుఁడ నీ కనుచూపులనె నా**
**మనసూ గరఁగించఁ బెనఁగే వేరా** **॥ఏలరా॥**

**కలికీచేఁతల వలపించి నను నిట్టె**
**కలసితి శ్రీవెంకటగిరినాథా.** **॥ఏలరా॥**

**భావ పరిమళం :**

చినతిరుమలయ్య చెప్పిన ఈ చిన్ని శృంగార సంకీర్తనలో విరహోద్వేగంతో ఒక గోపిక తన పగటు మాటల విటుడు కృష్ణయ్యతో యేమని అంటున్నదో ఆకర్ణించండి. రతియందు, కోపంలోనూ 'రా' కొట్టుట తప్పులేదన్నారుగా శృంగార కవులు. ఎందుకురా కృష్ణుడా? నేను మగనాలిని (మగని చాటు మగువను) నన్ను నవ్వుల పాలుచేస్తావేరా? పగటు (పుల్ల విఱుపు) మాటలతో, ఒగరూదోచగ (కఠినత్వం చూపి) యెందుకు బాధిస్తావురా? ఓ కొనబూవిటుడ (సొగసరి ప్రియుడా!) నీ కనుచూపులతోనే నా మనస్సునంతా కరిగించేస్తావేమిరా? అంతటితో వూరకే వుండక రతికేళికి బలవంతం చేస్తావేమిరా? శ్రీవేంకటగిరి నాథుడవైన ఓ కొండలరాయా! నీ మనోజ్ఞమైన చేతలతో నన్ను సులువుగా మురిపించి కూడితివి. ఇకపై నేను నిన్ను విడచి జీవించలేను.

★ **పెనగేవేరా** – బలవంతం యెందుకు చేస్తావురా

★ **కలికీచేతల** – మనోజ్ఞమైన పనులతో





సంఖ్య : 35 సంపుటము : 10 పుట: 20 రాగం : వరాళి

**7 వలపేమి దాఁగునా వన్నెకాఁడ**
**అలవడి నీ వెంత అణఁచఁ జూచినను** **॥పల్లవి॥**

**గక్కన మొక్కకుంటేను కాంత నిన్ను దీవించునా**
**తక్కి మాతో సిగ్గువడి దాఁచేవు గాక**
**చక్కఁగా నవ్వ కుండితె సరసము లాడునా**
**లెక్కించి మాకు వెఱచి లే దనేవు గాకా** **॥వలపే॥**

**చెనకక నీ వుంటె చెలి పూవుల వేసునా**
**పొనిగి మాతో లే దని బొంకేవు గాక**
**గునిసి యరువకుంటె కొంగు నిన్నుఁ బట్టునా**
**తనివోని నీననుపు దాఁచేవు గాకా** **॥వలపే॥**

**కన్నుసన్న సేయ కుంటె కాఁగిట నిన్నుఁ బట్టునా**
**అన్నిటా మాతోడుతఁ దో శాడేవు గాక**
**వెన్నడించి యాపెను శ్రీవెంకటనాథుఁడ కూడి**
**మన్నించితి నన్ను నిట్టె మండెమురాయఁడవె.** **॥వలపే॥**

**భావ పరిమళం :**

కడప జిల్లా చినమండెము గ్రామంలో నెలకొన్న నృసింహస్వామిపై చినతిరుమలయ్య చెప్పిన ఈ సరస శృంగార కీర్తనలో నాయిక చెంచులక్ష్మి నరహరిగా మారిన స్వామివారితో యేమంటున్నదో ఆస్వాదించండి. ఓ వన్నెకాడా! వలపు అనేది యేలాగున దాగుతుంది? నీవు శ్రమపడి దానినెంత అణచజూచినా అది సాధ్యమౌతుందా? ఆ కాంతామణి నిన్నెందుకు ఆశీర్వదించింది? నీవు మొక్కి వుంటావు. అందుకే సిగ్గుపడి మా దగ్గర దాస్తున్నావు. నీవు ఆవిడతో చక్కగా హాస్యోక్తులాడుతూ నవ్వకుంటే, ఆమె నీతో సరసములెందుకు ఆడుతుంది? ఇదంతా వూమించే నీవు మా దగ్గర యేమీలేదని బుకాయిస్తున్నావు. నీవు ఆమెను తాకకుంటే నీపై పూలచెండు విసురుతుందా? పైగా మాతో నీకూ ఆమెకూ యేమి లేదని అబద్ధాలు చెబుతున్నావు. నీవు విలాసముగా యేదో చేయకపోతే ఆమె నీ పంచె కొంగుపట్టి యెందుకు లాగుతుంది? తృప్తి తీరని నీ అనురాగం దాచే ప్రయత్నం చేస్తున్నావు. అంతే నీవు ఆమెకేదో కనుసన్న చేయకుంటే నిన్ను యెందుకు కౌగిట్లో బిగిస్తుంది? నీవు అన్నిట్లోనూ మాతో తోసివేస్తున్నావు. మండెములో వెలసిన వన్నెకాడైన నరహరి సాక్షాత్తూ శ్రీవేంకటేశ్వరుడే. ఆయన ఆమె (చెంచులక్ష్మి) ను, కూడి నన్నూ ఇట్టే మన్నించాడు.

★ **గునిసియరువకుంటే** – విలాసముగా యేదో చేయకుంటే

సంఖ్య : 82 సంపుటము : 6 పుట: 60 రాగం : సామంతం

**12 కొమ్మ నీ వెవో కోపింతు వతఁడు**
**రమ్మనఁగఁ బిలువ నిటు రావమ్మా** ॥పల్లవి॥

**నెయ్య మెఱింగి చెలియ నీవె పో యతనితో**
**చయ్యాటములనే పగ చాటేవు**
**కయ్యపుమాటలకు కనుచూపు కాఁకలకు**
**నియ్యకొన కతనిచన వియ్యవమ్మా.** ॥కొమ్మ॥

**అందముగ నతఁడు మాటాడఁగా నతనితో**
**మందమందమె కాని మాటాడవు**
**గొంది నిందాఁక చెక్కునఁ జేయి తియ్యవిదె**
**మందలించక వెనక మఱువవమ్మా.** ॥కొమ్మ॥

**ఇప్పు డిదె తిరువేంకటేశ్వరుఁడు పచ్చడము**
**కప్పఁగానే కొంత కసరేవు**
**రెప్పలను నవ్వుపచరించి తింతటిలోన**
**నెప్పుడును నిటువలెనె యెనయవమ్మా.** ॥కొమ్మ॥

**భావ పరిమళం :**

అన్నమయ్య ఈ సరస శృంగార కీర్తనలో నాయిక చెలికత్తెయై ఆమెకేమి బోధపరుస్తున్నారో వినండి. ఓ కోమలీ! ఇతగాడు జగన్నాథుడు. తనంతట తానే నిన్ను పిలువనంపితే కోపింతువేమమ్మా? ఆలస్యం చేయక, ఇటు రావమ్మా! ఓ చెలియా! స్నేహపు పరిమళము నెఱిగి అతను నీతో సయ్యాటకు ప్రయత్నిస్తుంటే, నీవు అతనితో వైరం చూపుతున్నావు. పోవమ్మా! కయ్యాలమారి మాటలు, కోపము నెగడే చూపులు ప్రదర్శించక అతనితో ఒకింత చనువుగా వుండవమ్మా! ఓ చెలీ! అతగాడు అందముగా నీతో మెల్లి మెల్లిగా మాటలాడయత్నిస్తున్నాడు. కానీ నీవేమో బిగదీసుకు పోయావు. ఇప్పటిదాకా ఒక మూల నీ చెక్కిట జేర్చిన తమరి చేతినే తీయవైతివి. అతనిని మందలించవద్దు. వెనక జరిగినవన్నీ మరువక, తవ్వితలపోస్తుంటే ప్రణయం పరిమళిస్తుందా? ఓ చెలీ! ఇప్పుడు స్వయంగా శ్రీవేంకటేశ్వరుడే నీపై కొంగు కప్పుతుంటే కొంత కసురుకొంటావేమమ్మా? అయినా నాకు తెలియదనుకోకు, ఇంతలోనే నీ కనురెప్పలతో నవ్వులు ప్రదర్శించినావు. ఎప్పుడునూ ఇటువలెనే అతిశయించవమ్మా

★ **గొంది** – ఒకమూల ★ **పచ్చడము** – వస్త్రము, కొంగు





సంఖ్య : 84 సంపుటము : 10 పుట: 48 రాగం : లలిత

**9 చాలా మేలుదిరా యీబాలామ ణిపుడు నీ**
**పాలిటఁ జిక్కెరా గోపాలక కృష్ణమ్మా** ॥పల్లవి॥

**పంకాజముఖి నీవంకా చూచి నప్పుడే**
**పొంకాముగా వలచె యింకా నే మందురా**
**సంకె లేక నీమీఁద నంకిత మైనపాట**
**లంకించి పాడీ నీతో లంకెలఁ గృష్ణమ్మా** ॥చాలా॥

**పల్లాదమున నీవు మొల్లామి నందరిలో**
**మొల్లాపూబంతి వేయ జల్లూనఁ గరఁగెరా**
**మెల్లానె వ్రాసి చూచీఁ జల్లాఁగ నీ రూపమె**
**కల్లా గాదురా శ్రీవల్లభ కృష్ణమ్మా** ॥చాలా॥

**తటుకానా నీ వప్పుడు నటనాలా సరసాన**
**యిటు నటుఁ గాఁగిలించ నెట్లాఁ దాఁ జొక్కెరా**
**విటరాయఁడవు శ్రీవెంకటనాథ నీ కూటమి**
**ఘటియించ వేడుక మిక్కుట మాయఁ గృష్ణమ్మా** ॥చాలా॥

**భావ పరిమళం :**

గోపాలకృష్ణునిపై సరస శృంగార కీర్తన వినిపిస్తున్నారు చినతిరుమలయ్య. ముద్దుగా గోపాలకృష్ణమ్మ అని సంబోధిస్తున్నారు. ఒక గోపిక గురించి వివరిస్తూ ఈ బాలామణి చాలా మేలైనదిరా అని చెబుతున్నారు. అది నీ పాలిట చిక్కినదిరా గోపాలక కృష్ణమ్మా! అని అంటున్నారు. ఇంకా నేమందురా కృష్ణమా! ఈ పంకజముఖి నీ వంక నొక్కసారి చూచిందో లేదో నిన్ను పరిపూర్ణముగా వలచినది. ఓ కృష్ణమ్మా! యింకానేమందురా! అసంఖ్యాకమైన వలపు పాటలను అంకిత భావముతో తన గొంతెత్తి పాడినది. నిన్ను పెనవేసికొని పరవశించినది గోపాలక కృష్ణమ్మా! ఓ కృష్ణమ్మా! పల్లదాన (ధూర్తునివలె) నీవు తఱచుగా అందరిలో మొల్లల పూబంతిని నాపై వేస్తే, నా గుండె జల్లనకరిగింది కదరా! శ్రీవల్లభుడవైన కృష్ణమ్మా! నేను చెప్పేది కల్లకాదురా, ఆ పూలతోనే వసారాలో నీ పేరు వ్రాసి దాన్ని చూచి, మురిసిపోయానురా. ఓ చిలిపిరసికుడా! అప్పుడు నీవేం చేశావో తెలుసా నన్ను చటుక్కున నర్తిస్తూ సరసముగా గుచ్చి కౌగలించికొనినావు. నన్ను పరవశింపజేసినావు. ఓ కృష్ణమ్మా! నీవే విటరాయడివైన శ్రీవేంకటేశ్వరుడవు. నీ కూటమి నాకు సంభవించి మిక్కిలి వేడుకాయెరా

★ **మొల్లామి** – తరచుగా ★ **లంకించి** – గొంతెత్తి

సంఖ్య : 2 సంపుటము : 6 పుట: 2 రాగం : భైరవి

**10** ప్రాయంపు మదములే పరిణామము మతిఁ
బాయని రమణికి నీపై నెంతవలపో. ॥పల్లవి॥

తమ్మి,పూవుఁగొలనిలో తరుణులుం దాము మింద
తుమ్మెద లీఁదులాడంగ దొంగి చూచి
కొమ్మ నినుఁ గూడి కేళాకూళితోఁ గస్తూరినీట
నిమ్ముల నోలలాడిన దెటువంటి వలపో. ॥ప్రాయం॥

కొదమమావిపై గండుఁగోవిల లేఁజిగురాకు
ముదిత కందీఁగాఁ ప్రేమమునఁదాఁజూచి
అదివొ యప్పరిగెపై నాకుమడిచి నీ వీఁగా
వదనాన నందుకొనె వడి నెంత వలపో. ॥ప్రాయం॥

నెయ్యంపుఁ జకోరము వెన్నెల రస మింతినోర
నొయ్యనె కుమ్మరించంగ నువిదచూచి
కయ్యంపుంగూటమిని వేంకటేశుండ తమ్మరస –
మియ్యంగఁ జొక్కితివి నీ విపుడెంతవలపో? ॥ప్రాయం॥

**భావ పరిమళం :**

అన్నమయ్య చెప్పిన ఈ సరస శృంగార కీర్తనలో నాయిక శ్రీవేంకటేశ్వరునితో యేమంటున్నారో వినండి. స్వామి ఈ చెలియ యొక్క ప్రాయమునకు సహజమైన, మదము యేవిధంగా పరిణమించిందో చూడవయ్యా! ఆమెకు నీపై ఎంత వలపో! పైగా నిన్ను విడువలేకున్నదయ్యా! స్వామీ! పద్మములున్న కొలనులో తరుణులు జలకములాడుతుంటే గండుతుమ్మెదలు తొంగి చూచినవి. ఆ సుందరి నీతో కలసి క్రీడా సరస్సులో కస్తూరి కలిపిన నీటిలో ఓలలాడినదయ్యా! ఇక ఆమె వలపు యెటువంటిదో గ్రహించు. లేత మామిడి కొమ్మలపై గండుకోయిల లేజిగురాకు త్రుంపి తన ఆడుకోయిల నోటికందిస్తుంటే అది చూచి ప్రేరేపితయై, మిద్దెమీదనున్న ఈ తరుణి కూడా నీవు నోటి కందించిన తాంబూలమును చటుక్కున స్వీకరించినదయ్యా! మరి ఆమెకు నీపై యెంత వలపో కదా! పండు వెన్నెలలో తన నెచ్చెలికి వెన్నెల రసమును నోటితో అందిస్తూవున్న మగ చకోరమును చూచి, తనుకూడా ఈ కోమలి నీ నోటి తాంబూలమునందుకోవాలని ఆరాటపడినదయ్యా! శ్రీవేంకటేశా! నీవామె కోరినట్లే చేయగా, నీవు కూడా ఆమె వలపునకు పరవశించితివి. ఆమెకు నీపై యెంత వలపో ప్రభూ!

★ **కేళాకూళి** – క్రీడాసరస్సు ★ **ఉప్పరిగె** – మిద్దె





సంఖ్య : 170 సంపుటము : 6 పుట: 22 రాగం : శ్రీరాగం

**11** రాకురాకు మయ్యా మాతో రంతు లింతేలా
వాకు నిష్ఠూరాన నిన్ను వద్దన నేఁ జాలను. ॥పల్లవి॥

తొలవయ్య కాలుదాఁకీ దోసాలు గట్టకా
తొలుతేమి చేసితినో తొయ్యలినైతి
చెలఁగి యిందఱూ నీకుఁ జేయెత్తి మ్రొక్కగా
చిలుకు గోళ్ల నిన్నుఁ జెనక నేఁ జాలను. ॥రాకు॥

ఏమిటికి నంటించేవు ఎంగిలి మామోవి
బూమిలేని చదువుల పుట్ట నీనోరు
వేమాఱు నిందఱు నీకు వినుతించి మ్రొక్కంగ
ప్రేమపునోర నిన్ను పేరఁ దిట్టఁజాలను. ॥రాకు॥

యేల కిందుపడి మొక్కే వేమి బాఁతినే నీకు
కూళ నింతేని కాలిగోరఁ బోలను
మేలిమి శ్రీవేంకటేశ మెఱసి మాచనవు
మేలములాడుచు నిన్ను మెప్పించ నేఁ జాలను. ॥రాకు॥

**భావ పరిమళం :**

అన్నమయ్య చెప్పిన ఈ మధురకీర్తనలో నాయిక రమణునితో యేమంటున్నదో ఆలకించండి. ఓ రమణుడా! మాతో ఇంత రంధితో మా చెంతకు రాకుమయ్యా! నిష్ఠూరంగా మాట్లాడి నిన్ను వద్దని కూడ అనలేను. తొలినేమి జేసితినో (పురాకృత పాపం యేమి చేశానో) కాని, నేను ఆడుదానినైనాను. కావాలని నా కాలును తాకి నాకు దోసాలు అంటగట్టుతున్నావు. అతిశయించి, ఇంతమంది నీకు చేతులెత్తి మొక్కుతుంటే, నా కొనతేలిన చిలుక గోళ్ళతో నిన్ను గిచ్చనుకూడా జాలను. ఎంత చెప్పినా వినకుండా నీ యెంగిలి మూతిని మా మూతికి తాకిస్తావు. అదేమిటంటే... నీ నోరు భూమిలోలేని "పురాణాల" నన్నీ చదువుతుంది. ఇంతమంది వనితలు నీకు చేతులెత్తి మొక్కుతున్నారు. ప్రేమ సంభాషణ చేయవలసిన నోటితో నిన్ను నిందించగలనా? ఓ దుర్మార్గుడా! నీకు ఇంత భ్రాంతి తగునా? యేల కిందపడి మ్రొక్కెదవురా? నేను నీ కాలిగోటికి సాటిరానురా. బంగారము వంటి శ్రీవేంకటేశ్వరా! మా చనవు అతిశయించినా నీవెక్కడ, మేమెక్కడ? నీతో పరాచికాలు ఆడగలమా?

★ **కూళ** – దుర్మార్గుడా ★ **మేలములాడు** – పరిహాసము చేయు

సంఖ్య : 161 సంపుటము : 6 పుట: 117 రాగం: హిందోళవసంతం

**16 లలితాంగి యౌవనము లావణ్యములప్రోవు**
**అలరి యిటువలెఁ జేసెనమ్మా** ॥పల్లవి॥

**జవ్వాది మిగుల నుష్ణముమీఁద సంపంగి**
**పువ్వు గట్టినది గన పొదలెఁ దాపంబు**
**నివ్వటిలు గొజ్జంగి నీట నొయ్యన కడిగి**
**దువ్వటపుఁ బయ్యెదను దుడువరమ్మా!** ॥లలి॥

**మృగమదము గడు వేఁడి మెలుఁతతలపట్టునకు**
**అగలు గూడఁగ వేద నగ్గలంబాయ**
**బిగువైన కస్తూరి బేం ట్లొయ్యనగోర**
**నగలించి తట్టుపునుఁ గంటరమ్మా.** ॥లలి॥

**విరహతాపంబునకు వేరొండు గతిలేదు**
**పొరసి వేగించినాఁ బోదు**
**తిరువేంకటాచలాధిపుని మన్ననఁ గాని**
**అరిదిమోహము దీరదమ్మా!** ॥లలి॥

**భావ పరిమళం :**

అన్నమయ్య ఈ సరసశృంగార విభావరిలో, లలితాంగియైన అలమేల్మంగ సొబగులను వర్ణిస్తున్నారు. అందమైన యౌవనంపు అంగములతో అలరారుతున్న అ అన్నులమిన్న లావణ్యములప్రోవు. ఇట్లు అలరారిన ఆ తల్లి ఈవిధముగా జేసినదమ్మా! ఈ దేవి తన పతి విరహాగ్ని యొక్క అధికోష్ణమును సైచుటకు సంపంగి పూవులను కట్టుకొన్నది. అయిననూ తాపముపశమింపక అధికమైన వెలగలిగిన తన పైటకొంగును గుజ్జంగిపూలు కలిపిన నీటిలో తడిపి పయ్యెదలా వేసికొనినది. ఈ మెలుత (యువతి) కస్తూరి పట్టీ నుదుటికి వేసినది. విరహోష్ణమునకు ఈ కస్తూరి ఉష్ణముతోడై ఆమెకు వేదన అధికమే అయినది. ఓ అతివలారా! నామాట విని ఈ దేవికి కస్తూరిపట్టు యెండిపోతే పెల్లలుగా వూడదీసి, తట్టు పునుగును ఈమె దేహముపై అంటుడమ్మా! ఓ చెలులారా! ఈమె విరహతాపమునకు వేఱొండు మార్గము కనబడుట లేదు. ఆమె తన పతికోసం జాగారం చేసినా ఈ వేదన పోవుట లేదు. మరి యేమి చేయుట? తిరువేంకటాధీశుడు మన్ననజూపినగాని, ఈమె మోహము తీరదమ్మా!

★ **అగ్గలము** – అధికము ★ **వేగించినా** – జాగారము చేసినా





సంఖ్య : 83 సంపుటము : 6 పుట: 61 రాగం : భూపాళం

**13 అంతదొడ్డవారమా అందుకుఁ దగుదుమా**
**మంతనపుమాటల మరగించేవు** ॥పల్లవి॥

**నిన్నుఁ బోలువారమా నీయంతవారమా**
**వెన్నలుఁ జల్లలు నమ్మువెలఁదులము**
**పన్నినయీరత్నాల బంగారుటిండ్లలో**
**యెన్నకైనతూఁగుమంచ మెక్కు మనేవు** ॥అంత॥

**చెప్పరానివారమా చెమటపై వారమా**
**కప్పురంపుఁజవి యెఱుఁగనివారమా**
**చిప్పిలేటితేనెల సేమంతివిరుల**
**చప్పరములోనికి సారెఁ బిలిచేవు.** ॥అంత॥

**జంకెనలవారమా సరసపువారమా**
**మంకుమంకు మాటల మందవారమా**
**వెంకటాద్రి విభుఁడా వేడుకలరాయఁడా**
**తెంకికి నెప్పరిగమీఁదికి రమ్మనేవు.** ॥అంత॥

**భావ పరిమళం :**

అన్నమయ్య ఈ మధుర కీర్తనలో ఒక గోపికవలె కృష్ణయ్యతో నిష్ఠూరంగా యేమంటున్నారో ఆకర్ణించండి. కృష్ణయ్యా! నీ వలపుజల్లులలో తడిసేటంత అదృష్టం మాకు వున్నదా? మేము అంత దొడ్డవారమా? నీతో మంతనములాడే మాటల చాతుర్యం మాకున్నదా? మేము అందుకు తగినవారమా? మమ్మల్ని మాటలతో మరగించుట నీకు తగునా? కృష్ణా! మేము నిన్ను బోలినవారమా? నీ అంతటివారమా? మేము వెన్నలు, చల్లలు వెలకు అమ్ముకొనే వనితలము. రత్నాలు తాపడము జేసిన బంగారపు యిండ్లలో ఊయల మంచమునెక్కమని నీవన్నా మాకంత అదృష్టం దక్కుతుందా? మాతో నీకు సంబంధం వున్నదని చెప్పరానివారమా? చెమట పోవునట్లు పన్నీటి స్నానాలు చేయగలమా? కర్పూరము తింటూ రుచినాస్వాదించలేని గొల్లవారము. తేనెల మాధుర్యము నెరగము. చేమంతి పూలు విస్తరించిన పందిట్లోకి రమ్మని మాటిమాటికీ మమ్మల్ని పిలుస్తావు. ఇది బాగున్నదా? కృష్ణా! మేము నిన్ను బెదరించగలవారమా! పోనీ సరసములాడగల చతురులమా? పైగా పుష్కలంగా మంకుతనమున్న గొల్లవారము. ఓ వేంకటాద్రినాథుడా! వేడుకలరాయడా! మమ్మల్ని మిద్దె మీదకు రమ్మేనేవు. అది నీ స్థానమని మేమెరుగమా?

★ **చప్పరము** – పందిరి ★ **మందవారము** – గొల్లెతలము

సంఖ్య : 24 సంపుటము : 6 పుట: 18 రాగం : ముఖారి

**14 అహో సాధు తవాగమనం**
**బహుళవైభవైః ప్రతివచనైః కిమ్. ॥పల్లవి॥**

**తతోపసర మిథ్యాశరవచనై**
**రితస్తవైమన్మ హితం కిమ్**
**బత మమ దేహాత్ప్రాణ స్తథాపి**
**గత ఏవై తత్ కారణమిహ కిమ్. ॥అహో॥**

**సంవృతి చేలం జహి చపల త్వం**
**సంవాదేమే సతతం కిమ్**
**త్వం వా మమ చిత్తం సాంత్వయసి**
**కిం వా కురు మమ ఖేలనమిహ కిమ్. ॥అహో॥**

**అతి బిభేమి భవదాచరణాదిహ**
**చతుర వేంకటాచలరమణ**
**సతీం మా మనుసరసి కిమథన్ం**
**రతిరాజవిభవ రచనమిదం కిమ్. ॥అహో॥**

**భావ పరిమళం :**

అన్నమయ్య వినిపిస్తున్న గీర్వాణి సంకీర్తన ఇది. దేవి స్వామితో ఈ విధంగా అంటున్నది. అహో!! నీరాకయే విశేషము (బాగుబాగు). గొప్ప గొప్ప వైభవములు, ప్రతివచనములతో యేమి ప్రయోజనము? మిధ్యతో కూడిన మూర్ఖపు వచనములతో నింక తొలగిపొమ్ము. ఇంకా నాకు హితము చేయాలనుకోవడమేమి? నా దేహము నుండి ప్రాణము పోతున్నది. దీనికి కారణమేమిటోచెప్పు. చపలమనే కప్పిన వస్త్రాన్ని తొలగించు. నాతో ఎల్లప్పుడు సంవాదముతో ప్రయోజనమేమి? నీవు నా చిత్తాన్ని వూరడింపజేయుచున్నావు. నన్ను ఆటపట్టించుట యేమిటికి? నీ ఆచరణవలన యిక్కడ చాలా భయము జెందుచున్నాను. చతురుడవైన ఓ శ్రీవేంకటాచలనాథా! భార్యనైన నన్ను అనుసరిస్తున్నదెందులకు? ఓ రతిరాజ విభుడా! ఈ రచనా నాటకము (వ్యవహారము) యెందులకు?

★ **బిభేమి** – భీతిల్లుచున్నాను ★ **చేలం** – వస్త్రము





సంఖ్య : 162 సంపుటము : 6 పుట: 116 రాగం : పాడి

**15 సదయ మానససరోజాత మాదృశ వశం**
**వద ముదాహం త్వయా వంచనీయా కిమ్ ॥పల్లవి॥**

**జలధికన్యా పాంగ చారు విద్యుల్లతా**
**వలయ వాగురి కాంత వనకురంగ**
**లలితభవ దీక్షా విలాస మనసిజబాణ**
**కులిశపాతై రహం క్షోభణీయా కిమ్. ॥సదయ॥**

**ధరణీవధూ పయోధర కనకమేదినీ**
**ధరశిఖర కేళితత్పర మయూర**
**పరమ భవదీయ శోభనవదనచంద్రాంశు**
**తరణికిరణై రహం తాపనీయా కిమ్. ॥సదయ॥**

**చతురవేంకటనాథ సంభావయసి సం**
**ప్రతి యథా తత్ర్పకారం విహాయ**
**అతిచిర మనాగత్య హంత సంతాపకర**
**కింతవకృత్యై రహం ఖేదనీయా కిమ్. ॥సదయ॥**

**భావ పరిమళం :**

అన్నమయ్య చెప్పిన ఈ సంస్కృత శృంగార సంకీర్తననీవిధంగా నేను అందించగలుగుటకు ముఖ్య కారకులు డాక్టర్ పవన్. వారికి కృతజ్ఞతలు. ఇక కీర్తన భావమకరందాన్ని ఆస్వాదించండి. ఓ మానస సరోజాతా! దయాపురా! నన్ను వశపరచుకొనుటచేత సంతసించుచున్న నన్ను వంచించుట దేనికి?

జలధికన్యాపాంగ రమ్యమైన విద్యుల్లతలో చుట్టబడిన వాడవు. రమ్యమైన వాగురికాంతను, వనములోని లేడిపిల్లవంటి నేను లలితమైనదానను. నేను నీ దీక్షా విలాసవతిని. మనసిజ బాణాన్ని. నేను అంకుశ పాశముతో క్షోభింపబడుతున్నదెందులకు? ధరణీ వధూపయోధరమనే బంగారు భూమియగు (దేహమందు) గొప్ప శిఖరమునందు క్రీడించు కేళీ తత్పరుడవు, పరమమైన నీయొక్క శోభనవదనము యొక్క సూర్యకిరణములతో నేను తపించుచున్నదెందులకు? ఓ చతురవేంకటనాథా! నన్ను విశేషంగా భావించి యధాప్రకారము విడచి, చాలసేపు రాకుండగ, అయ్యో! సంతాపము కలుగజేయుచుండగ దుష్టపు పనులతో నేను దుఃఖము చెందుట యెందులకు?

★ **తరణికిరణై** – సూర్యకిరణములచే ★ **కులిశపాతై** – అంకుశపాశముతో

సంఖ్య : 76 సంపుటము : 6 పుట: 56 రాగం : పాడి

**20 నెఱజాణ తనమూ ని కింత కలదట**
**చిఱునవ్వుఁ జెలికింత చింతైనవలదా.** ॥పల్లవి॥

**నిక్కమైన బిగువు నీకింత గలదట**
**చక్కనియింతికి వద్దా జడనైనాను**
**ఎక్కడో నీమనసు ఎంతైనఁ గలదటా.**
**చెక్కుమీఁద దరుణికిఁ జేయైన వలదా.** ॥లల॥

**నెలకొన్నకసరు నీ కింత గలదట**
**వెలఁదిమతికి వద్దా వెరగైనా**
**నిలువుఁజెలువమూ నీకింత కలదట**
**కలికిచెలికిఁ గొంత కాఁకైన వలదా.** ॥నెఱ॥

**నీమేనివెరపూ నీ కింతకలదట**
**భామకు వద్దా తలప ట్టయినా**
**నేమము వేంకటేశ నీ కింతగలదట**
**కామినికి నింత వద్దా కౌఁగిటనీచనవూ.** ॥నెఱ॥

**భావ పరిమళం :**

అన్నమయ్య దేవి చెలికత్తెయై యేమంటున్నారో వినండి. నెరజాణ అంటే విశేషముగా నేర్పరియైన చాతుర్యముకల వనిత అని అర్థం. చెలికత్తె దేవితో యేమంటున్నదంటే... నెరజాణతనం నీకింతవున్నదంటే యేమో అనుకొన్నాను. నీ భర్త గురించి అంతా తెలిసిన నీవు చిరునవ్వులు చిందిస్తున్నావు. ఈ చెలికి చింతయే లేదని మేము అచ్చెరువొందుచున్నామమ్మా! దేవీ! నీకు నిజమైన బింకమున్నదమ్మా! చక్కని ఇంతికొంచెమైన బిగువు చూపాలి కదమ్మా! నీ మనస్సు ఇక్కడ లేదు. అదెక్కడో వున్నది. ఎందుకంటే నీ చేయి చెక్కిలిపైన చేర్చుట కూడా మఱచినావు. ఇంత తలపోతలెందుకు లేవమ్మా! దేవీ! నీకెంత కోపము వస్తుంటుందని వినియున్నాము. కాని నీ పతి చేతలకు నీకు ఆశ్చర్యము కలిగినట్లు కూడా అనిపించదు. నిలదీసే సౌందర్యం నీ స్వంతమట. ఇంత సొబగైన గుణములున్న నీకు కొంతైన కోపము లేకపోవటం కద్దా! దేవీ! స్వాభావికముగా నీవు భయపడు భామినివట. కాని భామలకు కొంతైనా యెదిరించే నైజము వలదా తల్లీ! ఇదిట్లుండనిమ్ము వో శ్రీవేంకటేశ్వరా! నీకీ భామిని యెడల ఇంత ఆపేక్ష కలదట మరి ఈ కామినికి నీకౌగిట చనువీయవలదా?

★ **తలపట్టు** – ఎదిరించే నైజము ★ **కసరు** – కోపము





సంఖ్య : 71 సంపుటము : 6 పుట: 53 రాగం : శ్రీరాగం

**17 తెలియ దెవ్వరికిని దేవదేవేశ యీ**
**నెలఁత భావం బెల్ల నీవెఱుఁగు దిఁకనూ.** ॥పల్లవి॥

**నిలుచుఁ దలయూఁచుఁ గన్నీరు వాలిక గోళ్లఁ**
**జినుకు నివ్వెఱఁగుపడుఁ జింతించును**
**పులకించు నలయుఁ దలపోయు నినుఁ జిత్తమున**
**నిలువునంగన విధము నీ వెఱుఁగు దిఁకను.** ॥తెలియ॥

**కమలంబు చెక్కుతోఁ గదియించు నెన్నుదుట**
**చెమటఁ బయ్యెదఁ దుడుచు సెలవినగును**
**తమకంపుఁగోరికలు తరుణి యిదె నినుఁబాసి**
**నిమిష మోర్వఁగలేదు నీ వెఱుఁగు దిఁకను,** ॥తెలియ॥

**వెక్కసపు నునుదురుము వెడవదల నేరదు**
**చిక్కుదేరఁగఁ గొంతసిగ్గు వడును**
**ఇక్కువలఁ దిరువేంకటేశ నినుఁ గూడె నిదె**
**నిక్కమీ చెలివగల నీవెఱుఁగు దిఁకనూ.** ॥తెలియ॥

**భావ పరిమళం :**

అన్నమయ్య ఈ మధుర సంకీర్తనలో దేవదేవుడైన మహేంద్రునివంటి మహనీయులకు ప్రభువైన తిరుమలేశుని యేమంటున్నారో వినండి. ప్రభూ! ఈ నెలత భావమేమియో అంతయును నీవెరుగుదువు. అది మరెవ్వరికీ తెలియదయ్యా! అంతెందుకు నీ విరహంతో ఆమె చేష్టలను నీవే చూడు. ఆమె ఒక్కసారిగా నిలిచిపోతుంది, తల పంకించి, నెమ్మదిగా వూపుతుంది, తన బుగ్గలపై కట్టిన కన్నీటి బిందువులను గోళ్ళతో చినుకుతుంది, కొంతసేపు భ్రాంతిపాలవుతుంది, కొంతసేపు ఆలోచనలతో కొట్టుమిట్టాడుతుంది, కొంతవడి పులకిస్తుంటుంది, దానికే అలసిపోతుంటుంది, కొంతసేపు తన మనస్సులో నిన్ను ధ్యానిస్తుంది. స్వామీ! ఈ అంగన విధమంతయూ నీవెఱుగనిదా? ఆమె తన కమలములవంటి చెక్కిళ్ళను నీ చిత్తరువునకు, ఆనిస్తుంది, నెన్నుదుటబట్టిన చెమటను పయ్యెదతో తుడుచుకొంటుంది. చిరునవ్వులను చిందిస్తుంది. ప్రభూ! తమకముల రేపెడి కోర్కెలతో సతమతమయ్యే ఈ తరుణి నిను వీడి మనజాలదయ్యా! నిమిషమైన సైపలేదని నీవెఱుగవా? ప్రభూ! అధికమైన నున్నటి తన కేశపాశమును వదులు చెయ్యాలని ఆమెకు తోచుటలేదు. మళ్ళీ తనను తానే తెలిసి తన తొందరపాటుకు సిగ్గుపడుతుంది. జాడ నెరిగిన శ్రీ వేంకటేశ్వరా! ఈమె నిన్ను గూడి ఉపశమించినది. నిజముగా ఈమె వగలన్నీ నీవెఱుగుదువు.

★ **ఇక్కువల** – జాడనెరిగిన ★ **నివ్వెరగువడు** – భ్రాంతిజెందును

సంఖ్య : 84 సంపుటము : 6 పుట: 61 రాగం : ముఖారి

**18 నినుఁ బాసినయట్లు నెలఁతకు వియోగదశ-**
**లెన్నడు నుఁదోప విదియేమోగాని** ॥పల్లవి॥

**నినుఁ దలఁచి లలితాంగి నీరూపమాత్మలోఁ**
**గని నీవు నవి బయలు కౌఁగిలించినది**
**తనర నాకాశతత్త్వము నీమహత్త్వమని**
**వనిత యెవ్వరిచేత వినెనోకాని.** ॥నిను॥

**నినుఁ బొగడి నీరూపు కనుదోయి కెదురైన**
**తనివిదీఱక బయలు తగఁ జూడఁదొడఁగి**
**మునుకొన్న సర్వతోముఖుఁడ వనఁగా నిన్ను**
**వెనుక కేభావమున వినెనో కాని.** ॥నిను॥

**తలఁపునను వాకుననుఁ దలఁపఁ దలఁపఁగ నీవు**
**కలసి యీకమలాక్షిఁ గౌగిలించితివి**
**తెలిసితిమి వేంకటాధిపతి నీ విన్నింటఁ**
**గలవనెడిమాట నిక్కంబువోకాని.** ॥నిను॥

**భావ పరిమళం :**

అన్నమయ్య చెప్పిన ఈ మధుర కీర్తనలో ఆయన, స్వామి చెలికత్తెయై యేమి చెబుతున్నారో ఆకర్ణించండి. ప్రభూ! నీ వియోగము ననుభవించుచున్న ఈ భామినికి నీ వియోగదశలెన్నటికీ బాధించుటలేదు. ఇదేమియోగాని విచిత్రముగనే వున్నది. ఈ లలితాంగి నిన్నే తలచుచుండుట వలన నీ రూపమునే తన ఆత్మలో పొందినది. ఆ రూపమును భూత తత్త్వములు నీలో కలవని, ప్రస్తుతము తను అనుభవించినది, నీ "ఆకాశతత్త్వమ"ని గ్రహించి యెవరి, ద్వారా వినినదో కాని, అది నీ మహత్త్వమని గ్రహించినది. ప్రభూ! ఈ నెలత నిన్ను కీర్తించగా నీ రూపమే ఆమె కనులముందే ప్రత్యక్షమైనది. దానినే తనివిదీరా దర్శించి, దరించి సర్వతోముఖుడవైన నిన్ను తన భావనలలో యెట్లు పొందుపరచుకొనినదోకాని నీవే తాననే భావననొందినది. ప్రభూ! ఆకమలాక్షి తన తలపున, వాక్కున నిన్ను దలపగా, దలపగా నీవు ఆమెను కలసి కౌగలించితివి. ఓ శ్రీ వేంకటేశ్వరా! నీవే కావాలనుకునేవారికి నీవు వారివారి భాగ్యమును అనుసరించి సామీప్యము, సారూప్యము మరియు సాయుజ్యము నొసంగెదవనుమాట నిక్కము.

★ **మునుకొన్న** – ముందుకువచ్చిన ★ **వాకునను** – వాక్కునందు



హరి సేవకే వేంకటేశముకుటం

సంఖ్య : 12 సంపుటము : 6 పుట: 9 రాగం : ఆహిరి

**19 సతికి నిటువంటి రాజస మేల కలిగెనే**
**తతిగొన్న విరహాగ్ని ధరియించ లేదు.** ॥పల్లవి॥

**తోరమగు భారంపు తురుమేల కలిగెనే**
**నారీమణికి మెఱుఁగు నళినముఖికి**
**వైరంపు మరుని నెవ్వగల బాణాగ్నిచే**
**జారఁగా పలుమారు సవరించలేదు.** ॥సతికి॥

**వెలఁదికి జఘనంపుఁ వ్రేఁగేల కలిగెనే**
**కలహంసగమనమునఁ గదల లేదు**
**నలికంపు నడుము సన్నమున నవకపు మణుల**
**మొలనూలు జారఁగా మోవనే లేదు.** ॥సతికి॥

**ఇంతికిని చక్కఁదన మింతేల కలిగెనే**
**వంతఁ బొరలించు యౌవనమదమున**
**ఇంతలోననె వేంకటేశు కౌఁగిటఁగలసి**
**మంతనపుఁ బరవశము మతిఁ దెలియలేదు.** ॥సతికి॥

**భావ పరిమళం :**

అన్నమయ్య చెప్పిన ఈ మధుర కీర్తనలో ఈ నీ సతి సాత్త్వికగుణములతో విలసిల్లే ముద్దుగుమ్మ. మరి ఇటువంటి ఈమెకు రాజస భావనలేల కలిగినవి. ముప్పిరిగొన్న విరహాగ్నిని వేగినందుకు కాదుగదా! పైగా ఈమె విరహాగ్నిని సైపలేకున్నదయ్యా! ఈ భామినికి ఉన్నతమైన, భారమైన కొప్పు యేలకలిగినదో కాని అది మెటిసిపోతున్నది. ఈ పద్మముఖికి మన్మథునితో వైరమెందులకు కలిగెనో కాని అతగాడు పలుమార్లు తన బాణాగ్నికి గురిజేయగా ఆమె పయ్యెద పలుమార్లు స్థానభ్రంశమునొందినది. దానినామె సవరించలేకున్నది. ఈ పడతికి ఇంత భారమైన జఘనములేల కలిగెనో కాని కలహంసగమనయైన ఈమెకు నడచుటకును శ్రమ కలుగుచున్నది. సన్నని ఈమె నడుము మరీ క్షీణించి నవరత్న ఖచితమైన మొలనూలు మాటిమాటికీ జారిపోగా దానినికూడా మోయలేకున్నది. ఈ ఇంతికి ఆ సృష్టికర్త యింత చక్కదనమెందుకిచ్చాడోగాని యౌవనమదమున వోలలాడుచున్నది. కాని, ఇంతలోనే శ్రీ వేంకటేశుని కౌగిటిలో కలియుటచే, అతిశయించిన పరవశముతో ఈమెకు మతి దెలియకున్నది.

★ **తోరమగు** – ఉన్నతమైన ★ **నలికంపు** – సన్ననైన

సంఖ్య : 94 సంపుటము : 6 పుట: 68 రాగం : కాంభోది

**24** ఇన్నియుఁ గొత్తలు దోఁచె నింతలోనె చెలి నీకు
విన్ననినగవు లెస్సవిధ మేఁటి కాయెనే. ॥పల్లవి॥

పెట్టినకస్తూరిబొట్టు పెదవిపై కేల జాఱె
కట్టిన చెంగావికెంపు కన్నుల కే లెక్కెనె
పుట్టిన లేఁజెమటలు పులక లేఁటికిఁ గప్పె
పట్టిన తామరమొగ్గ పదనేఁటి కాయెనే. ॥ఇన్నియు॥

కప్పినపయ్యదకొంగు కడకు నేఁటికి జాఱె
తిప్పిన మొగములోన తెలివేఁటికుండెనే
చెప్పినమాటలలోన చిఱునవ్వు లేల తోఁచె
ఒప్పైన చెలువ నీకు నొరపేఁటి కాయెనే. ॥ఇన్నియు॥

నిండిన సైరణలకు నిజ మేల లేదాయె
పండినకోరికలకు ప్రాణ మేల వచ్చెనే
కొండలలో నెలకొన్నకోనేటిరాయఁడు గూడె
యెండలేనినీడ నీకు నితవేల ఆయెనే. ॥ఇన్నియు॥

**భావ పరిమళం :**

అన్నమయ్య వినిపించిన ఈ శృంగార సంకీర్తన ప్రత్యేకత యేమంటే... దీనిలో వేంకటేశ మకుటం లేదు. కొండలలో నెలకొన్న కోనేటి రాయడిపై చెప్పిన కీర్తన ఇది. దేవి చెలికత్తెయైన అన్నమయ్య యేమంటున్నారో వినండి. ఓ చెలీ! (దేవీ!) నీకు అన్నీ కొత్తగానే కనిపిస్తున్నాయమ్మా!. వివర్ణములైన నగవులు ఇప్పటికిప్పుడు లెస్స విధముగా యెందుకు తోచుచున్నవమ్మా? ఓ భామినీ! నీవు నుదుట బెట్టిన కస్తూరీ తిలకము పెదవులపైకేల జారెనే? కట్టిన చెంగావిరంగు చీరె కెంపురంగు నీకన్నులకేల కమ్మినదే? పుట్టిన లేత చెమటలను నీ వాటుదేలిన పులకలు యేల కప్పివేసినవే. నీవు పట్టుకొనిన తామర మొగ్గ పదనుగా యెందుకు మారినదే? ఓ దేవీ! నీవు కప్పిన వల్లెవాటు కొంగు యేల జారిపోయినదే. నీవు మొగమును ముడిచినను అది తెలివినేల పొడజూపుచున్నదే? అతగాడు చెప్పిన మాటలు నీకు చిరునవ్వులనేల తెప్పించుచున్నవే? ఓ ఒప్పులకుప్పా! నీకు తాపమేల కలుగుచున్నదే. ఓ దేవీ! నీవేల సహనమును కోల్పోవుచున్నావమ్మా? పండిపోయిన నీ కోరికలకు ప్రాణము వచ్చినట్లేల తోచుచున్నదమ్మా. కొండలలో నెలకొన్న ఈ కోనేటి రాయడు నిన్ను కూడినాడు. నీకు వున్నట్లుండి యెండలేని నీడ హితమైనది. కాని అది సాధ్యమా?

★ **ఒరపు** – తాపము ★ **సైరణము** – సహనము





సంఖ్య : 87 సంపుటము : 6 పుట: 63 రాగం : ఆహిరి

**21** ఇన్నియును దగఁగలిగె నీయింతి కిదె యిపుడు
కన్నియల కిందరికిఁ గలిగె మోహములూ. ॥పల్లవి॥

నిగనిగనిమెఱుఁగు వెన్నెలమోమునకుఁ గలిగె
చిగురుమోవికిఁ గలిగెఁ జిఱునగవులు
పగటుఁగనుఁగొనలఁ బలపలని కెంపులు గలిగె
పొగరుఁజెమటలు గలిగె పొలఁతిచెక్కులను. ॥ఇన్నియు॥

ఒయ్యార మగు నలపు లువిదమేనికిఁ గలిగె
గయ్యాళి నడపులకుఁ గలిగె మురిపెములు
తొయ్యలికిఁ గలిగె సంతోషంపుఁబరవశము
పయ్యెదకుఁ గలిగెఁ బయిపైని నునుఁబూఁత. ॥ఇన్నియు॥

వెలఁది కిప్పుడు గలిగె వేంకటేశ్వరుకరుణ
తలఁపులకుఁ గలిగె చింతావియోగంబు
పులకలకుఁ గలిగెఁ దలఁపులలోని జొంపములు
అలుకలకుఁ గలిగెఁ బాయని విలాసములు. ॥ఇన్నియు॥

**భావ పరిమళం :**

అన్నమయ్య చెప్పిన ఈ సరస శృంగార సంకీర్తనలో కన్నియలకే మోహము కలిగించే యెన్నో విలక్షణమైన సొబగులు ఈ అలమేల్మంగకు కలుగుటచే ఆమె శ్రీవేంకటేశ్వరుని కరుణ పొందకలిగింది. ఇపుడు యీ ఇంతికి, ఇదే ఇన్ని సొబగులును తగినట్లు కలిగినవి. నిగినిగమను వెన్నెలవంటి మెఱపు ఈమె వదనమునకు కలిగెను. చిగురులువంటి అధరములకు లేత చిరునగవు కలిగెను. లావణ్యమొప్పు వాలుకన్నులకు కుడిభాగము ఎఱుపెక్కిన విశిష్టత కలిగెను. ఈ పొలతి చెక్కిళ్ళపై దట్టమైన చెమటలు కలిగెను. ఇంతేకాదయ్యా ప్రభూ! ఈ ఉవిద మేనికి ఒయ్యారముతో కూడిన అలసట కలిగెను. గర్వమును జూపట్టు ఈమె నడకకు యెన్నో మురిపెములు కూడినవి. ఈ తొయ్యలికి సంతోషముచే పరవశత్వము కలిగినది. అందుచేత ఈమె పయ్యెదకు నునుపైన పైపై పూతలు కలిగెను. తల్లీ! ఇంతకంటే యేమి వివరించగలనమ్మా. సరే! యేదైతేనేమి, ఈ వెలదికి యిప్పుడు శ్రీవేంకటేశుని కృప కలిగింది. ఈమె ఆలోచనలలోని చింతకు వియోగము కలిగి స్వామికి చేరువైనది. ఈ పులకరింతలకు గుబురులవంటి రోమాంచితములు కలిగినవి. ఈమె అలుకలు విలాసములుగా పరిణమించినవి.

★ **జొంపములు** – గుబురులు ★ **పగటు కనుకొనలు** – లావణ్యమొప్పు వాలుకన్నులు

సంఖ్య : 79 సంపుటము : 6 పుట: 58 రాగం : వరాళి

**22** **నీకువలచిన సతికి నెగులు గలదా మీఁద**
**నీకరుణ మఱవ కింతియ చాలును.** ॥పల్లవి॥

**నీవంటి చతురునకు నిక్కంబుగా వలఁచి**
**జీవంబు విడిచినా సేగిగలదా**
**భావముల నినుఁదలఁచి పడఁతి యిట్లాయెనని**
**ఆవేళ నను దలఁచు మంతేచాలు.** ॥నీకు॥

**తగిలి నినుఁ బాసి సంతాపదావాగ్ని నిటు**
**నొగిలి నా నాకిందు నొప్పి గలదా**
**పగదేర మరునిపూబాణములఁ దెగినపొం-**
**దుగ నప్పుడైన వగతువుగా నీవు.** ॥నీకు॥

**కూరుముల నిటు నిన్నుఁ గూడిన లతాంగికిని**
**వేఱె యిఁక మరుచేతి వెఱపు గలదా**
**సారమతి వేంకటేశ్వర నన్ను నలయించి**
**యీరీతి నైనఁ జన విత్తుగా నీవు.** ॥నీకు॥

**భావ పరిమళం :**

అన్నమయ్య ఈ కీర్తనలో స్వామిని పొగుడుతూ యేమి అంటున్నారో వినండి. ప్రభూ! నిన్ను వలచిన తరుణికి దుఃఖమనేది వుంటుందా? మఱువలేని నీ కరుణ లభ్యమైతే ఇక ఈ బ్రతుకున అన్నీ దొరికినట్లే కదా! అది చాలదా? స్వామీ! నీవంటి చతురుడైన సరసునకై ప్రాణములను వీడినా నష్టమేముంది? ఆ పడతి తన భావనలలో కూడా నిన్నే తలంచుచు పరవశించినది. ఓ ప్రభూ! నీవు మమైకానందం పొందేవేళ నన్ను తలచుకోరాదా? దేవేశా! నిన్ను బాసిన దుఃఖము, దావాగ్నియై, ఇటు రగిలిపోయినా, అదేమి వింతయో కాని నాకు ఒకింత బాధకూడా లేదు. ప్రియా! పోనిమ్ము పగబూనిన మదనుని పూబాణములు తగిలినప్పుడైనా నీవు వగచెదవు. ప్రభూ! ఇది నిక్కము. స్వామీ! యెన్నో మమతలతో ఇట్లు నిన్ను కూడిన ఈ లలితాంగి ఇకపై మన్మథుని చేతనైనా బాధకలుగదు. సారమతివైన ఓ శ్రీవేంకటేశ్వరా! నన్ను అలిసిపోవునట్లు జేసిన నీవు ఈరీతిగానైనా నాకు నీవు చనువునిచ్చితివి. ధన్యురాలను ప్రభూ!

★ **పగదేర** – శత్రుత్వముతో ★ **సేగిగలదా** – నష్టమున్నదా





సంఖ్య : 118 సంపుటము : 6 పుట: 86 రాగం : ఆహిరి

**23** **చక్కని బోయ జవరాలు మించు**
**చెక్కుపై చేతితో చెలి దూరే నిపుడు.** ॥పల్లవి॥

**చింతచిగురుదెచ్చి చెలువైన వలపుల**
**సంతనమ్మిన బోయ జవరాలు**
**కంతుగురుఁడ నిన్నుఁగలయంగఁ దలపోసి**
**చింతచిగురుచేతఁ జిమిడే నిపుడు** ॥చక్కని॥

**కిన్నర కులుకుల కెరలి జారెడి గుబ్బ**
**చన్ను మూయదు బోయ జవరాలు**
**వెన్నుఁడ నినుఁ బాసి వెడమాయ కోవిల**
**కున్నల కులుకులు గులికే నిపుడు.** ॥చక్కని॥

**వల్లెవాట్లతోడ వడిఁ బెద్దకన్నుల**
**చల్లుఁ జూపులబోయజవరాలు**
**నల్లని తిరుమల నాయని కౌఁగిట**
**చల్లని చూపుల జంకించె నిపుడు** ॥చక్కని॥

**భావ పరిమళం :**

అన్నమయ్య చెప్పిన శృంగార కీర్తన ఇది. బహుకాలమునాటి మాట. అప్పట్లో తిరుమల బోయజాతి వారి సేవలో వుండేది. మనబోటి "నాగరికులకు" అందని ఆ దేవరను వారు బోయ నాయకుడని వ్యవహరించేవారు. మరి అటువంటి తిరుమలనాయని ఒక చక్కని బోయ జవరాలు, వలచింది. కాని ఆయనగారి మనసు కరుగలేదు. ఇంకేముంది ఈ రాతి మనిషినేమి చేయాలా, అని ఆవిడగారు చెక్కిలిపై చెయ్యి జేర్చి చింతించి ఫలితం లేక ఇపుడు తిట్లు కూడా లంకించుకొంది. ఆబోయ జవరాలు, చింత చిగురు విఫణి వీధిలో అమ్ముటకు తీసికొనివచ్చి, సంతకు తెచ్చింది. ఓ మదన జనకా! నిన్ను కూడెదననే తలపులలో నిమగ్నమై పాపం! ఆ జవ్వని ఇపుడు ఆ చింత చిగురునంతా ముద్దముద్దచేసి పాడుచేసింది. ఆ బోయ జవరాలు తన "కిన్నెర"ను వాయిస్తూ కులుకుతుంటే తన చనుగుబ్బలపై ఆచ్ఛాదన జారిపోయింది. అయినా ఆమె తన కుచగిరులను కప్పుకొనయత్నమే చేయుటలేదు. ఓ వెన్నుడా! నిన్ను బాసిన నీ బోయ జవరాలు ఇకపై తమ గొంతుతో శృతి కలుపుతుందనే ఆశతో కోయిల కూనలు కులికినవి. ఆమెవెంటనే తన వల్లెవాటును త్వరత్వరగా సవరించుకుని, విప్పారిన తన నేత్రములతో ఆ బోయజవరాలు నిన్ను చల్లని చూపులతో చూచినది. నల్లని ఈ తిరుమల బోయనాయని కౌగిట కరిగి రాటుదేలి ఇప్పుడు స్వామినే బెదిరించునట్లున్నా చల్లగా చూస్తున్నది. (అన్నట్లు ఈ కీర్తనలో వేంకటమకుటం లేదు.)

★ **కిన్నెర** – ఒక తంత్రీ వాయిద్యము ★ **చిమిడె** – ముద్దముద్దజేయు

సంఖ్య : 111 సంపుటము : 15 పుట: 74 రాగం : ముఖారి

**28** నారాయణ నీవే నాథుఁడ వైతి నాకు
గారవించి రక్షించి కరుణించవయ్యా ॥పల్లవి॥

అంచల నా కర్మమనే అలుగు బండారించితి
పెంచి యింద్రియాలఁ బంపు వెట్టకుమయ్య
వంచి పుణ్యముల మేఁడి వారము మీ కిచ్చితిమి
మించిన కామాదులనే మేరగాండ్లేలయ్య ॥నారా॥

మునుపే ఆసలనేటి మొదలు గడమ చెల్లె
పనివూని పాతకపు పనులేలయ్య
మనసనే మోపు నెమ్మది నీకు నప్పగించితి
ఘన దుఃఖముల తరకాండ్లేలయ్య ॥నారా॥

శ్రీ వేంకటేశ నీ భక్తిసీమకు నే నేలికైతి
తావుల చింతల దరిద్రము లేలయ్య
నీవు నాకుఁ గాణాచి నే నీ యాధీనము
వోవల పరధర్మపు దొత్తు కాండ్లేలయ్య ॥నారా॥**111**

**భావ పరిమళం :**

పెదతిరుమలయ్య శ్రీమన్నారాయణుని సన్నుతిస్తున్నారు. ఓ నారాయణుడా! నీవే నాథుడవు, అయినావు. కావున నా బాధ్యత నీదే. నన్ను ప్రేమతో రక్షించి కరుణ జూపవయ్యా! అంటున్నారు. దేవా! నా సంచిత కర్మములనే ఒక భాండాగారములో భద్రపరచి మరువకుండా మాకర్మ మాకు ఒప్పచెబుతావు. వీటికి తోడు ఇంద్రియాలనే మా శత్రువులను కూడా మాపై దండెత్తించకు మయ్యో! మా మేలుగోరే పుణ్యములనే హితులను మీకిచ్చాము. నీవేమో వారికి పోటీగా కామక్రోథాలనే ఆరుగురు దుర్మార్గుల్ని మేరగాండ్లగా మాకు అంటగట్టావు. వాళ్ళు ధన, ధాన్యాది రూపంలో దోచినంత దోచేస్తున్నారు. ఈ పీడ మాకెందుకు పెట్టావయ్యా ప్రభూ! మొదలుపెట్టిన నా ఆశలకు అంతూ పొంతూ లేదు. దానికితోడుగా పనిగట్టుకొని మాచేత పాపపు పనులేల చేయిస్తావయ్యా? ఎలాగో అలాగా నా మనస్సు అనే భారాన్ని నీకు అంటగట్టాను. నీవు మాత్రం తక్కువ వాడివా? గొప్ప దుఃఖమనే తరకాండ్లను (మథన పెట్టేవారిని) మాకు అంటగట్టావు. స్వామీ! మేమెంత మా బ్రతుకెంత? మాకీ పాడు పీడ యెందుకు పెట్టావు? ఓ శ్రీవేంకటేశ్వరా! యేదో మాపై దయదలచి భక్తి అనే రాజ్యానికి నన్ను అధికారిని చేశావు అమ్మయ్య! అని సంతోషిస్తుంటే, చింత-దరిద్రము అనే దొంగల్ని నా రాజ్యంలోనే తిరగమన్నావేమయ్యా? మూలధనములాంటి నీవు నాకున్నావని సంతోషిస్తుంటే, మధ్యలో పరధర్మం అనే తొత్తుగాళ్ళెందుకయ్యా?

★ **మేరగాండ్లు** – ధనధాన్యములను దోచువారు ★ **ఓవల** – అటుపైన





సంఖ్య : 31 సంపుటము : 17 పుట: 20 రాగం : పాడి

**25** ఆఁడువారు కడుఁ గోపు లవుట నీ వెఱుఁగవా
నేఁడు గొత్తలుగా బూమి నేర్చుక వచ్చేరా ॥పల్లవి॥

వలచినయాఁడువారు వాదులాటకు వచ్చిన
చలము సాదించువాఁడు జాణఁడా వాఁడు
కలయ నీరాకతోడ కమ్మటి నీలిగి పోఁగా
పిలిచి మాటాడకున్న ప్రియుఁడా వాఁడు ॥ఆఁడు॥

చనవు గలుగువారు సణఁగులఁ దిట్టఁగాను
కనలి యెగ్గువట్టితే ఘనుఁడా వాఁడు
గునిసి సవతులపై కోపాన పతి నంటేను
ఎని నవ్వకుండేవాఁడు విభుఁడా వాఁడు ॥ఆఁడు॥

పాయరానియట్టివారు బలుములు చూపితేను
నాయాలఁ బెట్టెడివాఁడు నాథుఁడా వాఁడు
యీయెడ శ్రీవేంకటేశ యింతి నిట్టె కూడితివి
చాయకు రాకుండువాఁడు సరసుఁడా వాఁడు ॥ఆఁడు॥**31**

**భావ పరిమళం :**

పెదతిరుమలయ్య తన తండ్రి అన్నమయ్య వలెనే శృంగార కీర్తనలు చెప్పటంలో ఆరితేరినవాడని దీన్ని చదివాక మీరూ అంగీకరిస్తారు. పల్లవిని చూస్తేనే ఈ విషయం తెలుస్తోంది. ప్రత్యేకించి, ఇద్దరు పెళ్ళాల ముద్దుల మగళ్ళకు ఈ కీర్తన మార్గావిష్కరణ చేస్తుందంటే నమ్మండి. ఓ శృంగారరాయా! నీవు కూడా ఇద్దరు సతుల ముద్దుల మగనివేకదా! ఆడువారు యెంతో కోపవశ్యులు. ఇది నీవెఱగవా స్వామీ! భూమిలో నేడు ఇదేమన్నా కొత్తగా చూస్తున్నామా? కొత్తగా నేర్చుకొంటున్నారా? వలచిన భార్య యేదో పంతంతో వాదులాటకు వస్తే మొండితనంతో పోట్లాడేవాడు జాణడా, ప్రభూ! ఒక్కొక్కసారి నీవే కలియుటకు వచ్చినా, నీలుగుడు చూపిస్తారు కాంతలు. అప్పుడు అనునయంగా తానే వారిని పలుకరించి మాట్లాడాలి. ముంగిగా వుండేవాడు ప్రియుడా? స్వామీ! భర్తతో చనవున్న ఆడవారు సణుగుతూ తిట్టడం కూడా కద్దు. అప్పుడూ తానూ మనసు కష్టపెట్టుకొని నేరారోపణ చేసేవాడు యేమి మొగుడు స్వామీ! సవతులు వుంటే కయ్యాలు వియ్యాలవారిలా వస్తాయి. అప్పుడు ఆ సవతులు గునిసి కోపంతో పతిని నిందిస్తారు. అప్పుడాపతి నవ్వుకొని అనునయించాలి. అట్లా చేయకపోతే వాడేం మొగుడయ్యా? విడువలేని భార్యలు బలప్రయోగం చేసికొంటే, న్యాయాధికారిలా తీర్పుచెప్పేవాడు నాథుడా? ప్రభూ! ఇప్పుడు నిన్నే చూడవయ్యా! శ్రీవేంకటేశ్వరా! అలిగిన ఇంతిని ఇట్టే కూడితివి. స్వామీ! అసలు, పెళ్ళాం దారికిరానివాడు... వాడేం సరసుడయ్యా?

★ **చాయకువచ్చుట** – దారిలోకి వచ్చుట ★ **చలము** – పట్టుదల

సంఖ్య : 216   సంపుటము : 15   పుట: 144   రాగం : భూపాళం

**26 ఏమి చిత్రం బేమి మహిమలు యేమి నీ మాయావినోదము**
**వామనాచ్యుత నిన్నుఁ దెలియఁగ వసుధలో మాతరములా ॥పల్లవి॥**

**సకలలోకవాసనాయక శౌరి మురహర నరహరీ**
**ప్రకటమాయెను నీ గుణంబులు పాలముచ్చ వటంచును**
**వికటముగ నినుఁ గన్న తల్లి వేల నీ వదనంబు మీఁటిన**
**అకట హా యని నోరు దెరచిన యందు లోకము లుండెను ॥ఏమి॥**

**శ్రీసతీపతి దైత్యదానవశిక్ష కామర రక్షక**
**రాసి కెక్కెను బండిరొప్పిన రవ్వలా నీ సేఁతలు**
**మోసమున నర్జునుఁడు నీలో ముందు గానక మాటలాడిన**
**వాసవార్చిత విశ్వరూపము వసుధఁ జూపితి వవుదువు ॥ఏమి॥**

**నమో నమో శ్రీవేంకటేశ్వర నారదప్రియ భక్తవత్సల**
**విమలమగు నీ దాసు లిదె నీ విద్య లెల్లాఁ జూచిరి**
**సుముఖులైకరిశబరిబలియును శుకధ్రువాదులు నిన్నుఁ గొలువ**
**సమత వున్నతపదము లొసఁగితి సర్వమిందునుఁ గంటిమి ॥ఏమి॥**

**భావ పరిమళం :**

ఇది పెదతిరుమలయ్య చెప్పిన శౌరీచిద్విలాసము. అధ్యాత్మకీర్తనలు, అందులోనూ భజన రూపంలో వినిపించినప్పుడు పాడేవారికే కాక వంతపాడే వారికీ అచ్యుతుని ఆశ్రయం లభిస్తుంది. ఇది సత్యం. కాకపోతే భక్తిలేని భజన మాత్రం వృథా! ఓ శ్రీహరీ! నీ మాయావిలాసము, యెంత చిత్రమైనది! ఏమి మహిమలు చూపితివయ్యా!! కాని నిన్ను గుర్తించలేని మా దౌర్భాగ్యమునేమందును? ఓ వామనా! ఓ అచ్యుతా! నిన్ను దెలియుట మా తరమా తండ్రీ! మేమెంత మా బ్రతుకెంత? ఓ శౌరీ, మురహరా! నరహరీ! త్రిభువన వాసుల నాయకా! పాల దొంగవని నీ గుణము బ్రకటితమైనది సరియే! మేము అన్యులము కానీ నీ మాతృమూర్తి నీ నోటిలో పదునాల్గు భువనాలను జూచి నిన్ను కొట్టలేక కట్టెవలె నిశ్చేష్టగా మారినది. ఓ శ్రీ సతీపతీ! దైత్యులను, దానవులను శిక్షించి అమరులను రక్షించువాడవే, ఒక మూలనున్న బండిని తన్ని విఱచుటచే, నీ చేతలు సామాన్యులకర్థం కానేకావు. మోసపోయాడా యేమి ఆ అర్జునుడు? నిన్ను బావగా, రథసారథిగా, యాదవునిగా యెంచి నీవు వాసవార్చితుడవని మరచితే విశ్వరూపం చూపి బెంబేలెత్తించావు. ఓ శ్రీవేంకటేశ్వరా! నారదప్రియా! భక్తవత్సలా! నమోనమో! నిర్మలమైన నీ దాసులు మాత్రమే నీ మహిమలెల్లా జూచిరి. నీ శరణాగతులైన గజేంద్రుడు, శబరి, బలి నిన్ను గొలిచెడి శుక, ధ్రువాదులకు నీవు వైకుంఠము నొసగుట సర్వమూ మేమీ పుడమిలోనే గంటిమి ప్రభూ!

★ **రొప్పిన** – కోపించిన ★ **సుముఖులై** – ప్రసన్నవదనులై





సంఖ్య : 125   సంపుటము : 15   పుట: 83   రాగం : ధన్యాసి

**27 బ్రహ్మ పూజించే రఘుపతి విభీషణు కిచ్చె**
**బ్రహ్మణ్యుఁడీ రంగపతిఁ గొలువరో ॥పల్లవి॥**

**కావేరీ మధ్య రంగక్షేత్ర మల్లదిగో**
**శ్రీవిమాన మదిగో శేషపర్యంక మిదె**
**దేవుఁ డల్లదె వాఁడే దేవి శ్రీ లక్ష్మి యదె**
**సేవించరో నాభిఁ జిగురించె నతఁడూ ॥బ్రహ్మ॥**

**యేడు గోడలు నవిగో యెసఁగు పూఁదోఁపు లవె**
**కూడి దామోదరపురగోపుర మదె**
**తోడ వేయిగంబాల దొడ్డమంటప మదిగో**
**చూడరో పసిఁడిమించులకంబ మదిగో ॥బ్రహ్మ॥**

**ఆళువారలు వారే యంగరంగవిభవ మదే**
**వాలు శ్రీ వైష్ణవపు వాడ లవిగో**
**ఆలీల శ్రీ వేంకటేశుఁడై వర మిచ్చీని**
**తాలిముల శ్రీరంగ దైవముఁ గొలువరో ॥బ్రహ్మ॥125**

**భావ పరిమళం :**

పెదతిరుమలయ్య ఈ అధ్యాత్మ కీర్తనలో శ్రీ రంగనాథస్వామి వారి విభూతిని వర్ణిస్తున్నారు. నేటికాలంలో కావేరీనది ఒడ్డున గల శ్రీరంగంలో వెలసిన రంగనాథుని అర్చామూర్తిని అలనాడు రఘుపతిచే విభీషణునికి కానుకగా నొసగబడినది. మరి ఆ రాఘవునికి బ్రహ్మదేవుడే స్వయంగా తానుకొలిచే ఆ అర్చామూర్తిని ఇచ్చాడు. బ్రహ్మణ్యుడైన ఆ శ్రీరంగనాథుని కొలువరయ్యా! అల్లదిగో ఉభయ కావేరీనదీ మధ్యంలో శ్రీరంగక్షేత్రము. అదిగో దేవదేవుని ఆలయ విమానము. అదిగో ఆదిశేషతల్పము. అదిగో వాడే శ్రీరంగనాథుడు. అదే రంగనాథుని దేవేరి శ్రీలక్ష్మి. అదిగో ఆయన నాభికమలంలోంచి చిగురించాడు "అత"డైన బ్రహ్మదేవుడు. వారిని సేవించండయ్యా! అవిగో ఏడు గోడలు ఆలయమును పరివేష్ఠించినవి. అదిగో శ్రీరంగనాథుని పూదోట. అదిగో దామోదరపుర గోపురము. అదిగో వేయిస్తంభముల దొడ్డమండపము. అదిగో అపరంజిలా మెఱసిపోతున్న స్థంభము. చూడరయ్యా భక్తులారా! అల్లదిగో వారే పన్నెండుమంది ఆళ్వారులు. అంగరంగ వైభవమని ప్రసిద్ధికెక్కినది (అంగములకు అనగా దేవతా విగ్రములకు, రంగమునకు అనగా ఆలయమునకు అన్ని భోగాలతో వూరేగింపు చేయుట) అదిగో అవిగో వైష్ణవ వాడలు. ఆ విధముగా శ్రీవేంకటేశ్వరుడే తానైన శ్రీరంగనాథుడు కొలిచి ధన్యులౌదురు గాక!

★ **తాలిముల** – క్షమగల ★ **బ్రహ్మణ్యుడు** – బ్రాహ్మణులకు హితుడు

సంఖ్య : 325 సంపుటము : 5 పుట: 221 రాగం : భూపాళం

**32** రాయడికాఁడు గదమ్మ రంతు సేసీని
పాయపుసతులనే గోపాల గోవిందుఁడు ॥పల్లవి॥

వట్టిమాయలఁ బెట్టవలదన్న మానఁడు
బెట్టుగ రేపల్లె గోపికలనెల్ల
యెట్టు వేగింతురమ్మ యెల్లవారలును
రట్టడియైనట్టి రాచగోవిందుఁడు ॥రాయడి॥

లేని పగలు చాటి లేమలనిందరిని
కాని కానిమ్మనుచుఁ గరఁగించీని
మాని మాని కమ్మర మగుడ మమ్మేఁచీని
రానీలే చూచుఁగాని రాచగోవిందుఁడు ॥రాయడి॥

పొద్దు వొద్దునకెంతే బూమెలు సేయుచును
వొద్దికై నాతోడ నొనగూడీని
అద్దో యింకా మానఁడాసలఁ బెట్టెడిని
గద్దరి శ్రీ తిరువేంకటపు గోవిందుఁడు ॥రాయడి॥

**భావ పరిమళం :**

అన్నమయ్య చెప్పిన ఈ శృంగార కీర్తన వివరించుట, నల్లేరుమీద బండి కాదు. ఆనాటి తెలుగు మాటలీనాడు వ్యవహారంలో లేకపోవటం దీనికి ఒక ముఖ్య కారణం. రాయడికాడు అంటే ఉపద్రవం కలిగించేవాడని అర్థం. అబ్బో! ఈ గోపాలగోవిందుడు యెంత "రాయడికాడో" యేమి చెప్పమంటారు? ఎలప్రాయంలోవున్న యువతులను "ఒప్పించటం"లో మొనగాడు గదమ్మా!! వీడు వూరకే పడచులను మాయలో పడేస్తాడు. ఇది నీకు తగదురా అంటే మానడు. రేపల్లె గోపికలనెల్లా గట్టిగా పట్టుకొంటాడు. వీనితో యెట్లా వేగుదమమ్మా? అందరినీ వేపుకు తింటున్నాడు" ఈ రాచబిడ్డడైన గోవిందుడు రట్టడికాడమ్మా (అల్లరివాడమ్మా!) లేమలను (స్త్రీలను), లేని పగ వున్నట్లు నటించి లొంగదీసుకుంటాడు. కానీలే కానీలేండి మీకసలు ప్రేమేలేదు... వంటి మాయమాటలు చెప్పి కరగించేస్తాడు. మాతో స్నేహం మానినట్లు నటించి, ఆ తరువాత మళ్ళీ మొదటికే వచ్చి బాధిస్తుంటాడు. నేడు రాచగోవిందుడైనాడు కదా! మనదగ్గరకు రానీలే... చూతుము వాని సంగతి. పూట పూటకీ యేవేవో మాయలు చేస్తుంటాడు. కానీ నేనంటే ఒద్దికగా అంగీకరిస్తాడు. అదిగో నేడు శ్రీవేంకటేశ్వరుడైనగానీ ఆసలబెట్టుట మానడు. ఈ తిరువేంకట గోవిందుడు దిట్టతనము కలవాడంటే నమ్మండి.

★ **గద్దరి** – దిట్టతనం కలవాడు ★ **బూమెలు** – మాయలు





సంఖ్య : 230 సంపుటము : 15 పుట: 153 రాగం : మలహరి

**29** మునుకొని పయిఁడికి ముద్ర వాసిగతి
పనివడి యివి యేర్పరచఁగ వలెను ॥పల్లవి॥

నానాత్ములలో నారాయణుఁడే
హీనాధికములు యిం దేవి
జ్ఞానాధికు లెంచఁగ నిందధికము
యీ నిజ మొకటి యెఱుఁగఁగ వలెను ॥మును॥

అన్ని చోటులును యచ్యుతపదమే
యెన్నఁగ విశేష మిందేది
సన్నిధిగల యర్చావతారమిది
వున్నతి ఘన మని వుండఁగవలెను ॥మును॥

పలుకు లెల్ల శ్రీపతినామములే
యిలఁగా దనియెడి దిందేది
యెలమితో శ్రీవేంకటేశ్వరునుతియే
తలఁపున ఘనమని తడవఁగవలెను ॥మును॥**230**

**భావ పరిమళం :**

పెదతిరుమలయ్య ఈ కీర్తనలో చక్కటి తత్త్వబోధనావిష్కరిస్తున్నారు. పూనుకొని బంగారమునకు కూడా ముద్రలేసి దాని 'వన్నె' యెట్టిదో ప్రకటించి తీరవలసినదే. ప్రజల, ప్రభుత్వ సౌకర్యార్థము ఇవియన్నీ యేర్పరచవలసినదే కదా! శ్రీమన్నారాయణుడు సర్వాత్మకుడైయున్నాడు. ఇందులో హీనాధికములు లేవు. అయితే వీరిలో జ్ఞానాధికులు కొందరున్నారు. వారు ముద్రవేసిన పైడివలె యెంపికకు అధికులే. ఈ నిజము అందరూ తెలిసికొని తీరాలి. అన్నిచోట్ల అచ్యుతుడున్నాడు. అన్నీ ఆయన కాలూనిన తావులే. ఇందులో విశేషమేముంది? కాని మనయెట్ట యెదుట నున్న ఈ అర్చావతారము వున్నతమైనది, ఘనమైనది అని యెంచగవలదా? మనం మాట్లాడుతున్నామంటే నాదబ్రహ్మ రూపంలో హరి మన కంఠంలో వుండుట జేత ఆ గొంతుకు శ్రావ్యతనిస్తున్నది శ్రీపతి కాక మరెవ్వరు? మనము యేమి పలికినా అది శ్రీహరి నామమే. ఆయన నామము కానిదేది? మనం యేమి పలికినా, శ్రీవేంకటేశ్వరుని సన్నుతిచేస్తూ పలికెడిదే ఘనమైనదని, ప్రస్తావించవలెను.

★ **తడవగవలెను** – ప్రస్తావించాలి ★ **మునుకొని** – ముందుపూనుకొని

సంఖ్య : 179 సంపుటము : 15 పుట: 119 రాగం : శంకరాభరణం

**30 పని లేదు పాట లేదు భ్రమించి వీఁడు మా**
**మనసెల్ల దక్కఁగొనె మాధవ గోవిందుఁడూ** ॥పల్లవి॥

**పూచిన మానికింద పోఁటీ వెట్టుక తా నుండీ**
**యేచి పిల్లగోవి యూదీ యేఁటికే వీఁడు**
**తాచి తన రాగాలకు తానే చొక్కి రేపల్లె**
**చూచి చూచి బొమ్మలార్చి చూడవే వీఁడు** ॥పని॥

**కాలిపైఁ గాలు వేసి కడు మువ్వంక నొరఁగి**
**వేలివుంగరాలు చూపీ వేసాల వీఁడు**
**నీలమేఘపువర్ణుఁడై నెమలిచుంగులపాగ**
**తూలియాడఁ దల వూఁచీ దొడ్డవాఁడే వీఁడు** ॥పని॥

**పీతాంబరము గట్టి పెను సొమ్ము లెల్లఁ బెట్టి**
**చేతుల శంఖుచక్రాల చెలఁగీ వీఁడు**
**యీతల శ్రీవేంకటేశుఁ డిందరి కిన్ని రూపుల**
**కాతరానఁ గూడీవాఁడు గబ్బిగదె వీఁడు** ॥పని॥**179**

**భావ పరిమళం :**

పెదతిరుమలయ్య చెప్పిన ఈ కీర్తన మురళీధరుని విలాసమును ప్రతిఫలిస్తున్నది. శృంగార ఛాయలున్నా ఇది అధ్యాత్మ కీర్తనగానే, యెంచబడుతున్నది. విని ఆనందించండి. ఈ మురళీకృష్ణునికి వేరే పనీపాటా యేమీ లేనట్లుంది. వీడు యెందుకింత భ్రమ చెందుతున్నాడో కాని, ఈ మాధవుడు మా అందరి మనసెల్లా దక్కించుకొన్నాడు. ఈ గోవిందుడు అసాధ్యుడు. విరగబూచిన చెట్టు క్రింద, దానికి ఆనుకొని వుండి, అంతమధురంగా పిల్లగోవి (మురళి) వాయిస్తాడేమే? తన మధుర రాగాలకు తానే పరవశించిన రేపల్లె కేసి చూచి చూచి కనుబొమ్మలు కదల్చుతాడెందుకే? నిటారుగా వున్న కాలుపై ఇంకొక కాలు వంకరగా ఆన్చి నిలుచున్నా తాను మూడు వంకరలు తిరిగి మనోహరంగా నిలుచున్నాడు. అందరికీ వేలివుంగరం చూపుతూ పిల్లంగ్రోవి వాయిస్తున్నాడు. నీలిమేఘవర్ణముతోనున్న వీడు, వుంగరాల జుట్టు కొప్పులో నెమలి పింఛము ధరించాడు. తల మెల్లిగా వూపుతూ త్రుళ్ళిపడే వీడు, బహు దొడ్డవాడేనే. ఈ కృష్ణుడు పీతాంబరము ధరించి మెరిసే నగలను పెట్టుకొన్నాడు. భక్తితో చూస్తే శంఖ చక్రములున్న చతుర్భుజుడే వీడు. ఈతడే శ్రీవేంకటేశ్వరుడై యెవరెట్లా చూస్తే, అట్లా కనబడుతున్నాడు. వీడు గర్వంతో ఉత్సాహంగా కూడినాడే.

★ **దక్కగొను** – దక్కించుకొన్నాడు ★ **తాచి** – అవలంభించి
★ **గబ్బి**– గర్విష్టి ★ **కాతరాన** – ఉత్సాహముతో





సంఖ్య : 21 సంపుటము : 5 పుట: 15 రాగం : ముఖారి

**31 కలలోనె యిరువురము నలిగి వేగ**
**కలయనుచుఁ దెలిసి నినుఁ గౌఁగిలించితిరా** ॥పల్లవి॥

**అలుగుదురెఁ బతులనఁగా వినఁగ-**
**నలవాటు లేక నే నలుగుచుండుదురా**
**అలిగితట వురక నీవంత నాతోను మరి-**
**నలుగులౌనట పూవులంతలోపలనే** ॥కలలో॥

**చందురుఁడె సూర్యుఁడై జరగ మిగుల**
**కెందమ్ములవుర నాకెంగేలుదోయి**
**గందమే తోఁచెనట కస్తూరియనఁగ నా-**
**చందమపుడొకలాగు చందమవునటరా** ॥కలలో॥

**విటవరుఁడ కోనేటివిభుఁడ నీ-**
**వెటు దొలంగిన దేహమెట్టు నిలుపుదురా**
**యిటువలెనె మనలోన నెలమి మరచి**
**తటుకననుఁ గలయనుచు తలఁకి తెలిసితిరా.** ॥కలలో॥

**భావ పరిమళం :**

అన్నమయ్య వినిపించిన ఈ శృంగార సంకీర్తనలో దేవి యేమంటున్నదో వినండి. ఓ ప్రియా! నాకు ఒక తీయటి కల వచ్చింది. ఆ కలలో మనం ఇరువురము వేగముగా నలిగిపోయాము. అంతలోనే అది కల అని నాకు తెలియవచ్చింది. ఆపై తమకంతో నిను బిగియార కౌగలించితిని. ప్రియా! పతులు అలుగుట యెక్కడైనా కద్దా. వినుట అలవాటు లేనందువల్ల నేను అప్పుడప్పుడూ అలుగుతుంటానురా. అలవాటులో పొరబాటులా, ఇపుడు వూరక అలిగాను. నీవు అంత నాతోను బాధపడితివి. ఇపుడు పూవులు కూడ అంతలోనే నన్ను బాధిస్తున్నాయిరా. ప్రియా! ఈ రేయిలో చంద్రుడు నన్ను సూర్యునివలె భగభగ మండిస్తున్నాడు. నా అరచేతులు ఎఱ్ఱతామెరలని నీవెరగవా. అవి సంతోషంతో విచ్చుకొని నా అరచేతులు నిన్ను తాకినవి. చల్లదనము నీయవలసిన గంధము, కస్తూరి వలె వేడిని పెంచుతోంది. అప్పుడు నా విధానము నేవిధముగా మార్చుకొందునురా. విటులలో శ్రేష్ఠుడవైన నా ప్రియా! కోనేటిరాయా! నీవు నానుంచి తొలిగిపోతే నాదేహమెట్లా నిలుస్తుందిరా? ఈ విధంగా కలతజెంది మనమధ్యగల సంతోషమును కూడా నేను మఱచాను. కాని తటుక్కున అది కల అని తెలియవచ్చింది. చటుక్కున మెలకువ వచ్చింది.

★ **ఎలమి** – సంతోషము ★ **అలుగులౌనట** – బాధపడునట

సంఖ్య : 158   సంపుటము : 5   పుట: 107   రాగం : కన్నడగౌళ

**36** **వంచన ప్రియములవారే కాక**
**నించిన కన్నీటి నేనేల నీకు** ॥పల్లవి॥

**గిలుకు మట్టెలతోడ కిందిచూపులతోడ**
**సెలవి నవ్వులు నీ పైఁ జిందఁగాను**
**వలతువుగాక యెవ్వతి కైనఁ జిత్తము**
**నిలుపఁగనోపని నేనేల నీకు (ను)** ॥వంచన॥

**గోడచాట్లతోడ కో(కొ) నచీఁకటితోడ**
**వాడల నెలయించువారేకాక**
**వాడుచు లేమావి వడచల్ల వెడమాయ-**
**నీడలనెండే నేనేల నీకు** ॥వంచన॥

**జగడంబులతోడ సణఁగు సొలపుతోడ**
**వగ నిన్ను భ్రమయించువారె కాక**
**దిగులు లేక నిన్ను తిరువేంకటేశుఁడ**
**నెగులెరుఁగక కూడు నేనేల నీకు** ॥వంచన॥

**భావ పరిమళం :**

అన్నమయ్య వినిపించిన ఈ కీర్తనలో నాయిక బేల. స్వామిని ప్రేమగా ఆరాధించటం తప్పించి ఆమెకు మరేమీ తెలియదు. స్వామికున్న ఇతరవలపుగత్తెలను సాధించనూలేదు. ఆమె యేమంటున్నదో వినండి. ప్రభూ! నీకు వంచనలో సిద్ధ సాధ్యులయిన వలపుకత్తెలంతమంది వుండగా కన్నీరు నిండిన (సజల నేత్రాల) నేను నీకేమవసరము? సవ్వడి చేసే మట్టెలు ధరించిన వాళ్ళూ, తలపైకెత్తకుండా కింది చూపులు చూసేవాళ్ళు, మధురమైన చిరునవ్వులు చిందించేవాళ్ళు వుంటే వాళ్ళలో యెవ్వతెనైనా వలపులలో ముంచుతావు గాని... మనస్సును నిలువరించుకోలేని నావంటి అనామకురాలు నీకెందులకయ్యా? ప్రభూ! గోడలచాటుమాటున కొనచీకట్లలో నీతో మీ వాడలలో కులుకుతూ నిన్ను అలరించేవాళ్ళు లెక్కకు అందనంతమంది వుంటారు. వాళ్ళుకాక ఎండిపోతున్న లేతమామిడి చెట్టు వంటి నా వడచల్ల (వేడివడగాలి) వచ్చే నా నీడలో నీకు ఎండగానే వుంటుంది. నీకు నేనెందుకులే? ప్రభూ! నీతో జగడాలు పెట్టుకొంటూ, సణుక్కొంటూ, విముఖులుగా, వుండే వగలాడి వనితలు నిన్ను బాగా భ్రమింపజేస్తారు. ఆ విధముగా గాక, ఓ తిరువేంకటేశ్వరా! దుఃఖమనేది యెరుగక నిన్ను కూడెడి నేను నీకెందుకు పనికివస్తాను?

★ **గిలుకు** – ధ్వనించు ★ **నెగులు** – దుఃఖము





సంఖ్య : 306   సంపుటము : 5   పుట: 208   రాగం : కన్నడగౌళ

**33** **ఏలా యీ యనుమానములింతి మనంబునఁ బాయని-**
**తాలిమి తప్పుఁదెరువున దాఁగెఁగదోయమ్మా** ॥పల్లవి॥

**మాయపుమంటలు చల్లెడు మందమారుతము**
**పాయము దిరుగఁబారెడు పండుఁజందురుఁడు**
**కాయము తల్లడపరపెడు గండుగోయిలలు**
**యేయెడనోర్వదు చెలిలాగేలాగోయమ్మా** ॥ఏలా॥

**ఇంటఁ బుట్టిన యాతఁడే యింటఁ బుట్టిన యమ్ముల**
**యింటఁ బలుమరునేయఁగ నేమందునోయమ్మా**
**వొంటఁ బాసిన శరముల వెంటఁ దగిలెడు నారిని**
**యంటిన మదనానలమిఁక నారుపరాదమ్మా** ॥ఏలా॥

**కొండలరాయఁడు చెలిచనుఁగొండల నించిన గురుతులు**
**కొండుకచందురులైనవి కొత్తగదోయమ్మ**
**నిండిన విరహంబింతయు నేఁడిదె యమృతంబాయను**
**పండిన తమకము మేలై పలియించెనోయమ్మా** ॥ఏలా॥

**భావ పరిమళం :**

అన్నమయ్య శృంగార కీర్తనలున్న ఈ సంపుటములో పలు కీర్తనలకు వేంకటమకుటం లేకపోవటము గమనార్హము. ఈ కీర్తనలో నాయిక యెలా మధన పడుతుతున్నదో వివరిస్తున్నారు ఆలకించండి. ఈ భామిని మనస్సులో ఇంత అనుమానము యేల కలిగినదో? మనస్సు స్థైర్యంకోల్పోతే తప్పుడు బాటలోనే ఆలోచనలు వస్తుంటాయి కదమ్మా! ప్రకృతి కూడా దానికి తగ్గట్లే వున్నది. మందపవనములు మాయదారి మంటలను చిమ్ముతున్నాయి. ఎలప్రాయము తిరగబడుతున్నది. పండు వెన్నెల విఱగబూస్తున్నది. శరీరము తల్లడింపజేస్తున్నది. గండుకోయిలల కూజితముల సైతము ఈ చెలి సైపలేకున్నది. ఈ చెలిలాగు (ఆకర్షణము) యేలాగుననోయమ్మా! ఈమె కడుపున బుట్టిన యాతడే (మన్మథుడే) తన తోబుట్టిన పుష్పబాణములను, వింటితో అనేక పర్యాయములు వేయగా ఆతని నేనేమనగలనమ్మా? వింటిని విడచిన బాణము తోడునడచెడి కాంతను తాకిన జనించే మదనాగ్నిని ఆర్పడం యెవరివల్లనవుతుందమ్మా. ఈ కొండలరాయుడైన తిరువేంకటేశ్వరుడు, చెలిచనుగొండల మీద నింపిన నెలవంక చందురులైనవి. కొత్త కదుటమ్మా! నిండిన విరహమున నేడిదే అమృతమువలె తోచెడిని. పండిన తమకములు మేలుగా ఫలించినవే వోయమ్మా! (ఇది నాకు స్ఫురించిన భావము. అన్నమయ్య కీర్తన మాటలా?)

★ **కొండుకచందురులైనవి** – చిన్న గోటి గీరులైనవి ★ **తాలిమి** – స్థైర్యము

సంఖ్య : 146 సంపుటము : 5 పుట: 99 రాగం : సామంతం

**34** **సింగరాయనిఁ దిట్టీఁ జెంచెత వేలి-**
**వుంగరాలచేత నన్నొత్తకు నీవనుచు** ॥**పల్లవి**॥

**గురువింద పొదమరఁగున నుండి బిగిసీని**
**సిరివరు నెదుటనే చెంచెత**
**దొరలకే కాక నెత్తురుమన్ను మాకేల**
**బురదచెమటామై పొలసుకంపనుచు** ॥**సింగార**॥

**గుదిగొన్న మొగలిరేకుల యెన్న కొనగోరఁ**
**జిదిమి దేవునివేసీఁ జెంచెత**
**గదరుఁ బిల్లుల నేతికంపు నీ వొళ్ళెల్ల**
**కదియకు నా మేను కంటగించీననుచు** ॥**సింగార**॥

**కప్పురపుఁ దావి వేంకటపతికౌఁగిటఁ**
**జెప్పక యేతులే చెప్పీఁ జెంచెత**
**దప్పిదేరు తేనెల తనివార నీమోవి**
**యెప్పుడుఁ బాయక ఇట్టె ఇచ్చేవో యనుచు** ॥**సింగార**॥

**భావ పరిమళం :**

అన్నమయ్య చెబుతున్న ఈ సరస శృంగార కీర్తనలో శృంగారరాయని ఒక చెంచు పడచు తిట్టిందట. ఎందుకో తెలుసా? ఆ రాయడి వేలి ఉంగరాలు వొత్తుకుపోయి ఆమె నొచ్చిందట. ఆమె సిరివరుడు తనను గురువిందపొద మరుగునకు గొనిపోయి సరసమాడబోతే బిగుసుకుపోయింది. ఆ చెంచెత, "మీరు దొరలు, నెత్తురు మన్ను మాకెందుకు? మా ఒంటి చెమట చేపలకంపు" అని దెప్పింది. ఆ చెంచెత మొగలిరేకులవలె కొనదేలిన గోటితో దేవుడని కూడా యెంచక గిచ్చింది. పైగా ఇలా దెప్పుతోంది, మా చెంచుల సంగతి సరే! మీ భిల్లులు చెడుకంపు కొట్టరా? నేతివాసన వస్తారా యేమి? నా ఒళ్ళంతా దగ్గర చేర్చుకొని బిగించకు. నాకు నొప్పి కలుగుతుంది. సరే! నీవే వేంకటపతివి, అని అంగీకరిస్తాను. ఎందుకంటే నీ కౌగిలి కర్పూరపు గుబాళింపునిస్తున్నది. మేము చెంచులము చెప్పక చెప్పక మా ఉద్ధతినే చెప్పాలా? తనివిదీరా నీ అధరామృతమును వదలలేను. నేను యెప్పుడడిగితే అప్పుడియ్యవయ్యా! అది చాలు. (ఇది నాకు స్ఫురించిన భావన మాత్రమే).

★ **నెత్తురుమన్ను మాకేల** – రాజ్యం కోసం రక్తపాతమెందుకు ★ **ఏతులు** – ఉద్ధతి





సంఖ్య : 183 సంపుటము : 5 పుట: 125 రాగం : శ్రీరాగం

**35** **చెల్లఁబో అలుగ నేఁడు సిగ్గుగాదా**
**వొల్లని వీనిఁ బాసి వుడికీ నామనసు** ॥**పల్లవి**॥

**పొలసి యీ ప్రాణమిట్టే పోయినాఁ బోయఁ గాక**
**తలవంపు సేసే యీ తను వేఁటికే**
**కలసియుఁ గలయని కఠి (న) చిత్తుని వీని**
**సొలసి కమ్మరఁ జూచీ నా మనసు** ॥**చెల్ల**॥

**మరుతాపమున మేను మాఁడిన మాఁడెఁగాక**
**పరులబారికిఁ జిక్కే బ్రదుకేఁటికే**
**విరహాన నొకతెపై వేదనఁ బొరలు వీని-**
**కరుణలే కోరీని కష్టపు నామనసు** ॥**చెల్ల**॥

**సడిఁబెట్టి వయసిట్టే చంపినఁ జంపెఁగాక**
**వడిఁబెట్టి వేఁచే నావయసేఁటికే**
**కడు జాణఁడైన వేంకటగిరీంద్రుఁడు వాని-**
**వొడలు సోఁకిన నిట్టే వుబ్బెడి నామనసు** ॥**చెల్ల**॥

**భావ పరిమళం :**

అన్నమయ్య చెప్పిన ఈ శృంగార సంకీర్తనలో దేవి తన చెలికత్తెతో తన మనసులోని అలజడి వివరిస్తున్నది. ఇదివరలో చెప్పినట్లు, ఇవి అన్నమయ్య తొలినాళ్ళ కవితలు. ఆయన తిరుమలేశుని ప్రేరణతో చెప్పినందువల్ల ఆనాటి తెలుగులో చెప్పిన కవి హృదయం పూర్తిగా అవగతమవటం లేదు. అప్పుడే కాలేజీకి వచ్చిన తెలుగు మీడియం విద్యార్థిలా వున్నది నా పరిస్థితి. లోతు తెలియని నదిలో ఈదులాట అంటే ఇదె. స్వామీ! నీవేగతి. దేవి యేమంటున్నదంటే... అమ్మయ్యో!! నేడు స్వామిపై అలుకచూపాలంటే సిగ్గేస్తున్నది. నా మనస్సు వీడు ఒల్లనన్నా వినదు. వీనిని వదలివుండాలంటే నా మనసు వుడికిపోతున్నది. చెలీ! నా ప్రాణాలు పోతే మాత్రం నష్టమేమిటే? నన్నే తలవంపుకు గురిచేసే ఈ తనువెందుకే? ఈ కఠినాత్ముడు నన్ను కలిసినా కలియనట్లే వుంటాడు. అయినా మనసు మరల మరల వీనినే చూస్తానంటున్నది. చెలీ! మన్మథ తాపంతో మాడిపోతే పోనీ... నష్టమేమిటి? అతనిది కాని నా బ్రతుకు మాత్రం నాకెందుకే? నేను వీని విరహంతో తపిస్తుంటే, ఇతగాడు మరొక దానికోసం వేగిరపడుతున్నాడు. అయినా కష్టం కలిగించే నా మనసు వీని కరుణలే కోరుతున్నది. ఓ చెలీ! నన్ను అల్లరిపెట్టే, నా మనస్సు నన్ను చంపితే చంపనీవే. నా వయస్సు కూడా నన్ను వేపుకు తింటున్నది. ఎంతో జాణయైన ఈ శ్రీవేంకటేశుడు వాని వొడలు నావంటిని తాకితే నా మనసు నామాట వింటుందా?

★ **సడిబెట్టి** – కలుషితం చేసి ★ **కమ్మర** – మరలి

సంఖ్య : 72 సంపుటము : 9 పుట: 42 రాగం : శుద్ధ వసంతం

**40 చాలుఁ జాలు నాతో జాణతనాలా**
**చాలుకొన్న నీచూపు జళిపించ నేలరా** ॥పల్లవి॥

**పలుకవె చెలియ పచ్చిగా నదె రోరి**
**పలుకు నీ కప్పురపు బరణి నదె**
**నిలువవె కొంతవడి నే వచ్చినందాఁక**
**నిలువు నీ నామమందె నిక్కమాయ నదెరా** ॥చాలు॥

**అడిగేనె యింతి అప్పటి ని న్నొక సుద్ది**
**అడుగులు నీయందునవె కదరా**
**ముడికారి సట లేలె ముదితా**
**ముడి నీ సిరసునఁ గొమ్ముడి యిదె కదరా** ॥చాలు॥

**కలసితిఁ గదె నిన్నుఁ గలికి నీవు**
**కలగంపపతి వౌతఁ గంటిరా నేను**
**అలరి ని న్నురమున నానితిఁ గదె నిన్ను**
**నల శ్రీవెంకటగిరి యానెఁ గదరా.** ॥చాలు॥ **72**

**భావ పరిమళం :**

అన్నమయ్య వినిపిస్తున్న ఈ శృంగార సంకీర్తన, ఒక సంవాద ప్రక్రియ. నాయిక నాయకులు జరిపిన సంభాషణ. స్వామి యేమన్నా చిన్న తిరకాసుపెడుతుంది నాయిక. మొదట స్వామియేమంటున్నారో వినండి. "చాలున్ చాలు... ఓ భామినీ! నాతో ఇంత జాణతనాలెందుకే నీకు"? దానికామె "అదేపనిగా జూచే, నీ చూపు నన్ను జడిపిస్తున్నదేలరా?" అని ప్రశ్నించింది. "ఓ చెలియా! పచ్చిగా (మర్మములేకుండా) మాటలాడరాదా?" ఆతడు ప్రాధేయపడ్డాడు. "ఓరి! నీ కర్పూరపు భరిణలో పలుకులు అయిపోయినాయా?" అని ఛలోక్తి విసిరిందామె. "ఓ చెలీ! నేను వచ్చి నిన్ను చేరేదాకా, కొంతసేపు నిలువరాదటే?" అని బ్రతిమిలాడినాడతను. "ఎలాగో... నీనుదుటనున్న తిరునామము నిలువుగానే వుందిగా? నానిలువరింత నీకేలరా?" అని మళ్ళీ సరాగమే. "ఓ ఇంతీ! నిన్నొక మాట, అప్పటి (మరల) అడగాలనుంది అడగమన్నావా?" "అడుగులు కావాలని చివరికి కొంపముంచటం, తమరికి అలవాటే కదా! స్వామీ!" ఆమె స్వామి వామనుడై బలికి యెసరుపెట్టటం... చురక అంటించింది. "ఓ ముదితా! ముడికారిసటలేలనే (కలహమురేపే పుల్లవిఱుపు మాటలెందుకే?)" అని కాస్త గట్టిగా అడిగాడు. "నీ తలమీద కొప్పు ముడి తమరు పెట్టుకొన్నారు స్వామీ"! అని బదులిచ్చిందామె. "ఇంకా నీకీ బెట్టు యెందుకే కలికీ? నిన్ను కలిసితిని కదటే?" అని అనునయించాడు. "తమరు కలగూరగంపవంటి పతివౌదువు. నీకు అందరూ నీవారే?" అన్నదామె. "నీకు నా వురముపైననే స్థానమిచ్చితిని గదే? అని ఆమె తనకేమో చెప్పాడు స్వామి. అక్కడ, మరి శ్రీవేంకటాద్రి వుండనే వున్నది కదరా" నాకేమి తక్కువ?

★ **ఆనితిని** – ధరించితిని ★ **జళిపించు** – భయపెట్టు





సంఖ్య : 172 సంపుటము : 5 పుట: 118 రాగం : కాంబోధి

**37 ఉయ్యాల మంచముమీఁద నూఁచి వేసారితిమి**
**ముయ్యదించుకయు రెప్ప మూసినాఁ దెరచును** ॥పల్లవి॥

**చందమామ పాదమాన సతికి వేఁగినదాఁకా**
**యెందును నిద్రలేదేమి సేతమే**
**గందపుటోవరిలోనఁ గప్పురంపుటింటిలోన**
**యిందుముఖి పవ్వళించు నింతలోనే లేచును** ॥ఉయ్యాల॥

**పంచసాయకుని పుష్పబాణమాన యిందాఁక**
**మంచముపైఁ బవ్వళించి మాటలాడదు**
**నించిన వాలుగన్నుల నిద్దురంటానుండితిమి**
**వంచిన రెప్పలవెంట వడిసీఁ గన్నీరు** ॥ఉయ్యాల॥

**వెన్నెలల వేంకటాద్రివిభుని లేనవ్వులాన**
**నన్నుఁ జూచియైనాఁ జెలి నవ్వదాయను**
**ఇన్నిటాను సంతసిల్లి యీ దేవదేవుని గూడి**
**మన్ననల యింత (నింత?) లోన మలసీని జెలియ** ॥ఉయ్యాల॥

**భావ పరిమళం :**

అన్నమయ్య చెప్పిన ఈ శృంగార కీర్తనలో దేవి చెలికత్తెలు యేమని వాపోతున్నారో వినండి. ఈమె ఉయ్యాల మంచము మీద పరుండినా ఈమెకు నిద్ర కరువైనది. ఊచి ఊచి మా చేతులు నొచ్చుతున్నవి కాని, ఈమె రెప్పలు మూతబడుటలేదు. చందమామ తన ప్రయాణం నింగిలో జరుపుతూనే వున్నాడు. ఎంతసేపైనా ఈమెకు నిదురరాదు. ఇక మనమేమి సేతుమే? కర్పూరము మెత్తిన ఇంటిలో గంధము దట్టించిన చంద్రశాలలో ఈ ఇందుముఖి పవ్వళించి నా అంతలోనే మేల్కొనుచున్నది. పంచబాణుడైన మన్మథుని విరిశరములు తాకి ఇప్పటిదాక మంచముపై మౌనంగా పవ్వళించిన ఈ దేవి యేమియు మాటలాడదు. విప్పారిన వాలుకన్నులు మూతలు పడేదాకా మేము వేచియున్నాము. వంచిన ఆమె కనురెప్పలు కన్నీరుగార్చుచున్నవి. ఓ చెలులారా! ఈ దేవిని చూచిన, మా లేతనగవులు చూచియైనా ఈ చెలి నవ్వదేమి? సరిలేయని ఆ దేవదేవుడు సంతసిల్లి దేవిని గూడినాడు. తనకు లభించిన ఈమన్ననతో ఆ దేవి తిరిగి స్వామితో పెనగినది.

★ **మలసినది** – పెనగినది ★ **పంచసాయకుడు** – మన్మథుడు

సంఖ్య : 35 సంపుటము : 9 పుట: 21 రాగం : ముఖారి

**38 ఔనో కాదో నీ వాన తీవయ్య**
**పూని వేరొకటి యిఁకఁ బోలదయ్యా** ‖పల్లవి‖

**చంచలము నాచూపు చంచలము నీగుణము**
**యెంచె నీ వే మనేవొ యెరఁగమయ్య**
**ముంచి నా గుబ్బలు రాయి మొగి నీ గుండె రాయి**
**అంచల నాకడ నేమి యాడుకొనేవయ్యా** ‖ఔనో‖

**చిగురు నా యధరము చిగురు నీ చిత్త మదె**
**తగెఁ దగ దందు కేమి తలవయ్య**
**నగవు నా మోమెల్ల నగుఁబాటు నీచింత యీ**
**తగవు చెలులతోడ తరిఁ జెప్పవయ్యా** ‖ఔనో‖

**లేఁత నాకుఁ గొనగోరు లేఁత నీవయసు గడు**
**యీఁతలు మోఁతలు నిఁక నేలయ్యా**
**ఘాతల శ్రీవెంకటేశ కదిసి కూడితి నన్ను**
**యీతల నిద్దరిభావాలేక మాయనయ్యా.** ‖ఔనో‖**35**

**భావ పరిమళం :**

అన్నమయ్య వినిపించిన ఈ శృంగార సంకీర్తనలో దేవి యేమంటున్నదో ఆకర్ణించండి. నేను చెప్పేది ఔనో కాదో నీవే ఆనతీయవయ్యా! వేరొకటి యిక పోల్చనసాధ్యము కదయ్యా! మన ఇద్దరిలోనూ యెంత సామ్యమున్నదో నీవే గమనించుము. ప్రభూ! నా చూపు మిక్కిలి చెంచలమైనది. మరి నీ గుణము కూడ మిక్కిలి చంచలమైనది. ఎంచి నీవేమనేవో యెవ్వరూ యెరుగరు. నా స్తనయుగ్మము రాయివలె బిగువైనది. మరి ఇటు నీ గుండె కూడా రాయి వంటిదే కదా! ఈ మాట యెందుకంటున్నానంటే, నీవు నాతోనే ఆడుకొంటున్నావు. ఇంకొక పోలిక వినుము. నా అధరములు చిగురుటాకుల వంటివి. నీ చిత్తముకూడా చిగురుటాకువంటిదే. చెప్పాలంటే రెంటికీ సరిపోయింది. ఇకదాంట్లో నీకు పోయేదేమున్నది? నా వదనము నవ్వులు చిందిస్తుంటుంది. ఇక నీ చింత నన్ను నవ్వులపాలు చేస్తున్నదని వేరే చెప్పాలా? చెలులతో తగవుబెట్టుకోవడం నీకే చెల్లిందిలే. నాకు కొనగోరు లేతగా మృదువైనది. మరి అనాదివైనా నీవయస్సు కూడా కడులేతయైనదే. ఇకపై నీచింతా భారము నాకెందుకయ్యా? దెబ్బకు దెబ్బ తీసే నైజంగల ఓ శ్రీవేంకటేశా! మన ఇరువురి భావాలు యేకమైనవయ్యా!

★ **తరి** – మథనము ★ **మోఁతలు** – చింతాభారములు





సంఖ్య : 300 సంపుటము : 9 పుట: 172 రాగం : సాళంగనాట

**39 అలుగకువమ్మ నీ వాతనితో నెన్నఁడును**
**పలువేడుకలతోనె పాయకుండరమ్మా** ‖పల్లవి‖

**జలధిఁ దపము సేసె సాధించెఁ బాతాళము**
**నెలఁత నీరమణుఁడు నీకుఁగానె**
**యిలవెల్లా హోరించె నెనసెఁ గొండగుహల**
**యెలమి నిన్నిటాను నీకితవుగానె** ‖అలు‖

**బాలబొమ్మచారై యుండె, పగలెల్లా సాధించె**
**నీలీలలు దలఁచి నీకుఁగానె**
**తాలిమి వ్రతమువట్టి ధర్మముతోఁ గూ డుండె**
**పాలించి నీవుచెప్పిన పనికిఁగానె** ‖అలు‖

**యెగ్గు సిగ్గుఁ జూడఁడాయె యెక్కెనుశిలాతలము**
**నిగ్గుల నన్నిటా మించి నీకుఁగానె**
**అగ్గలపు శ్రీవెంకటాద్రీశుఁడై నిలిచె**
**వొగ్గి నిన్నురాన మోచివుండుటకుఁగానె.** ‖అలు‖**300**

**భావ పరిమళం :**

ఇది దశావతార వివరణ కీర్తన అని పోల్చుకోగలిగినవారు నిజంగా అన్నమయ్య కీర్తనలలో ప్రావీణ్యం వున్నవారేనని అంగీకరించవచ్చును. జాగ్రత్తగా పరిశీలించండి. ఓదేవీ! నీ కోసం స్వామి యెన్నిపాట్లు పడ్డాడమ్మా! కావున నీవెన్నడూ అతనిపై అలగవద్దు. ఎన్నో వేడుకలతో యెన్నడు యెడబాయకవుండాలి. అప్పుడే మాబోటి వారికి ఆనందం. నీ విభుడు, జలధిని తపింపజేశాడు (మత్స్యావతారము), పాతాళమును సాధించి మంధర పర్వతాన్ని నిలిపాడు (కూర్మావతారం), భూమిని కైవశం చేసికొనినాడు (వరాహావతారము), కొండగుహలలో వర్ధిల్లాడు (నారసింహుడు), ఇన్నిటిలోను నీకు హితమునే ఒనరించినాడు. నీ రమణుడు నీకుగానె సహకరించినాడు. బాల బ్రహ్మచారిగా కూడా అవతరించి బలిని రసాతలం పంపి భూమిని రక్షించాడు (వామనావతారం), దుర్మార్గులైన క్షత్రియులపై పగసాధించాడు (పరశురామావతారం), వీటిలో కూడా పుడమి రూపంలో వున్న నీ కొరకే శ్రమించాడు. ధర్మ పరిరక్షణే ధ్యేయంగా, వ్రతముగా వున్నాడు (శ్రీరామావతరాం). నీవు చెప్పిన పనికోసమే ఆమెనీ ఆజ్ఞను పాలించినది (శ్రీకృష్ణావతారం). ఓ దేవీ! ఇతగాడు సిగ్గుయెగ్గులు పాటించడాయె (బుద్ధావతారం), శిలాతలమును అనగా 'రికాబు'ను యెక్కినాడు (కల్కి అవతారము). దుస్సహమైన శ్రీవేంకటేశ్వరుడై నిలిచినాడు మరి ఆ అవతారము దేనికో తెలుసా తల్లీ! నిన్ను తన వురమున మోయుటకే సుమా!

★ **అగ్గలము** – దుస్సహమైన ★ **తాలిమి** – క్షమ

సంఖ్య : 90  సంపుటము : 9  పుట: 52  రాగం : పాడి

**44 ఎట్టు సింగారింత మమ్మ యీ యింతిని**
**ముట్టని సింగారము ముందు ముందె యమరే** ॥పల్లవి॥

**పొలితి చంద్రవంకబొట్టు వెట్టఁ బోయి సంది**
**మలసే గోరొత్తు చూచి మాని(ని) నవ్వెను**
**కలిమిఁ జంద్రగావి గట్టఁబోయి అద్దములో**
**సొలపుఁ గన్నులకావి చూచి నవ్వెను** ॥ఎట్టు॥

**అమరిన ముత్యాలహారములు వెట్టఁ బోయి**
**చెమటముత్యాలు చూచి చెలి నవ్వెను**
**కొమరె యరవిరులు కొప్పున ముడువఁ బోయి**
**తమిఁ బులక విరులు తాఁ జూచి కొంకెను** ॥ఎట్టు॥

**వీఁగుచుఁ బరిమళము వెలఁది పూయఁగఁ బోయి**
**కాఁగిటి వాసన చూచి కడు నవ్వెను**
**సొగల శ్రీవెంకటేశు సురతసింగారము**
**వాగమై యమరెఁ గాన వన్నెలెల్ల నమరే.** ॥ఎట్టు॥**90**

**భావ పరిమళం :**

అన్నమయ్య వినిపిస్తున్న ఈ శృంగార సంకీర్తనలో దేవి చెలికత్తెలు, శృంగార క్రీడా పరితప్తమై తనకు చెలులు చేస్తున్న సింగారంలో తన విభుని చిలిపి చేతలు గుర్తుకు వచ్చి తమకించి దేవి నవ్వుకొంటున్న దేలనో తెలియక ఈ విధముగా తలపోస్తున్నారు. ఈ ఇంతిని మనమేతీరున సింగారింతమమ్మా! మనము చేయని సింగారములు కూడా ఈమెకు మున్మొందుగానె అమరివున్నవి. ఈపొలతి తన నుదుటిపై చంద్రవంక బొట్టు పెట్టబోతున్న చెలులను చూచి పక్కున నవ్వినది. తన కుచగిరులపై నున్న గోరొత్తులు గుర్తుకువచ్చినవేమో మరి. సిరులొలికే సింధూరపు రంగు చీరె గట్టబోతూ తన అద్దములో చూచి తన సొగకనులు నిద్రలేమిచే ఎఱుపెక్కిన వైనం గుర్తుకు వచ్చి ఆమె నవ్వినది. చక్కటి ముత్యాల హారం చూచి దాన్ని ధరించబోయి ఆ చెలి తనకు ముత్యపు బిందువులవంటి చెమటలు పట్టిన కథనము గుర్తుకువచ్చి నవ్వు ఆపుకొనలేకపోయింది. అరవిచ్చిన సుకుమారమైన పుష్పమాల తన కొప్పున ధరించుటకు యత్నించుచూ తన మేనిపై అరవిరుల వంటి పులకలు దేలిన సంగతి గుర్తుకువచ్చి సిగ్గుతో కుచించుకుపోయింది. ఆ వెలది తన ఒంటిపై చెలులు పరిమళ ద్రవ్యములు పూయుచుండగా తన ప్రియుని కౌగిటి పరిమళము గుర్తుకు వచ్చి ఆమె నవ్వినది. శ్రీవేంకటేశుని సురత శృంగారములోని ఒత్తిడి నెమరువేసికొనిన ఆమె వన్నెలతో వొప్పినది.

★ **చంద్రగావి** – సింధూరపు రంగుచీరె ★ **వాగమై** – ఒత్తిడిలో





సంఖ్య : 53  సంపుటము : 9  పుట: 31  రాగం : వరాళి

**41 ఏమౌత నెఱఁగ నీ వేమనేవె**
**నీ మన సొక్కటాయ నీవే నేనూ** ॥పల్లవి॥

**కొప్పు గడు వెడ జారె గుణము తేటలు దీరె**
**యిప్పుడు చెలియ నాతో నేమనేవె**
**రెప్పల ముత్యాలు గారె కప్పి చెక్కు చేయి చేరె**
**చెప్పినబుద్దులు విం(టె?) టిఁ జీఁకటె వెలుఁగు** ॥ఏమౌ॥

**నిలువురాఁకలఁ గాఁగె నిట్టూర్పు గడు రేఁగె**
**యెలుఁగెత్తి నీవు నాతో నేమనేవె**
**వలపులు దల కెక్కె వాఁడి కుచముల కెక్కె**
**చెలియ నీ వూఁకొంటి(టె?) చేవె చిగురు** ॥ఏమౌ॥

**చెదరి పయ్యెదజారె సిగ్గులు సెలవిఁ గారె**
**యెదు రెదురనె చెలి యేమనేవె**
**యిదివొ శ్రీ వెంకటేశుఁ డిటువచ్చి నన్నుఁ గూడె**
**సదమదమైతి రతిచలమె ఫలము** ॥ఏమౌ॥**59**

**భావ పరిమళం :**

అన్నమయ్య చెప్పిన ఈ శృంగార కీర్తన అవగతం కావాలంటే పద విభజన ఇలావుంటే బాగుంటుందని నా భావన. చెలికత్తెతో నాయిక యేమని అంటున్నదో వినండి. ఏమౌతుందో నేనెఱుగను. ఈవే మనేవే? నీ మనసూ నా మనసూ ఒకే విధంగా నీవేనేననేట్లుంటాము. నేను ఈ వేదన యెందుకు చెందుతున్నాను, చెప్పవే. నా కొప్పు వదులై జారిపోతున్నది నా భావనల గుణము తేటపడింది. ఇప్పుడు చెప్పవే చెలీ! నీవేమంటావే? నారెప్పల క్రింద నుంచి ముత్తెపుబిందువుల వలె కన్నీరుబుకుతున్నది. నా చెక్కిటనున్న చెయ్యి యెలాగో వాటిని కప్పగలిగింది. నీవు చెప్పిన హితము పాటించాను కాబట్టి చీకట్లు కమ్మిన బ్రతుకున వెలుగులు నిండాయి. చెలీ! వాని రాకలు నిలిపివేసినందున నా తనువు కాగిపోతున్నది. నిట్టూర్పులు చెలరేగినవి. ఇందాక నీవు నాతో బిగ్గరగా యేమని అన్నావే? వలపులు తలకెక్కినవి. కొనదేలిన కుచాగ్రములకా వలపెక్కినది. ఇట్లయితే చూస్తుండగానే చిగురులు మొగ్గలవుతాయి. ఓ చెలీ! చెదరిన నా పయ్యెద జారినదే. సిగ్గులు చిరునవ్వులై పూచినవి. నా యెదురెదురైన అతగానిని నేనేమనగలనే చెలియా! ఇదిగో ఇంతలో శ్రీవేంకటేశ్వరుడు తానే వచ్చి నన్ను కూడినాడు. ఆతని రాక ఫలమేమనగా సతమతమైన రతి చలమే. (ఈ వివరణ నా స్ఫురణకు తట్టినది, అంతే.)

★ **వెడజారె** – కొద్దిగా సడలినది ★ **వూకొంటే** – సమ్మతిస్తే

సంఖ్య : 173   సంపుటము : 9   పుట: 100   రాగం : దేసాక్షి

**42** **వినవమ్మ యశోద గోవింద కృష్ణుఁడు**
**చెనకి యెన్నిపనులు చేసెనమ్మ కృష్ణుఁడు** ॥పల్లవి॥

**వుట్టులు దాఁగొట్టఁగాను వువిదలు దిట్టఁగాను**
**ఱట్టాయ వీథులలో నుఱక కృష్ణుఁడు**
**పట్టినకోలల గొల్లపౌఁజు లిరువంకరాఁగ**
**పట్టుకొన్న గొల్లెతల భ్రమయించీఁ గృష్ణుఁడు** ॥విన॥

**పాలు దనపైఁ గారఁగా పడఁతులు నవ్వఁగాను**
**గేలికి లోనాయను జంగిలి కృష్ణుఁడు**
**ఆలరి యెలుఁగులతో నడ్డమువచ్చినవారి**
**మేలపు చేఁతలు చేసి మెప్పించీఁ గృష్ణుఁడు** ॥విన॥

**యిందులు దాఁజొరఁగాను యింతులు పైకొనఁగాను**
**బందుకు లోనాయను గోపాలకృష్ణుఁడు**
**అందనె శ్రీవెంకటాద్రి నలమేలుమంగఁ గూడి**
**దుండగపుఁ జేఁతలనె దొరాయఁ గృష్ణుఁడు.** ॥విన॥**173**

**భావ పరిమళం :**

అన్నమయ్య చెప్పిన ఈ శృంగార కీర్తనలో రేపల్లె గొల్లెతలు కృష్ణయ్యపై యశోదమ్మకు చాడీలు చెబుతున్నారు. ఈ కృష్ణయ్య వెన్న దొంగిలించి తాను తినడం తన అల్లరి గుంపును వేపడంతో ఆగలేదు. లేబ్రాయపు గొల్లెతలను భ్రమయించి అల్లరి చేస్తున్నాడు. ముందు ఇది విను యశోదమ్మా! మీ గోవింద కృష్ణుడున్నాడే గొల్లెతలను తాకి యేమేమి చేశాడమ్మా!! మీవాడు గోపికల ఇండ్లలో ఉట్లను కొట్టగా వాళ్ళంతా తిట్టిపోశారు. వీధులలో పెద్ద ఱట్టు అయింది. మీ కృష్ణుడు ఉఱకలుపెట్టి పారిపోయాడు చిన్న కోలలు (కఱ్ఱలు) ధరించిన తన గొల్లపౌజుతో (దండుతో) రెండువైపులా వస్తుంటే తమని పట్టుకొన్న గొల్లెతలను భ్రమింపజేసి పారిపోయాడమ్మా! మీ కృష్ణుడు. పాలు దొంగతనం చేయబోతే వున్నట్లుండి పాలన్నీ మీ కృష్ణుడి నెత్తిమీద కారిపోయాయి. అదిచూచి గొల్లెతలంతా పకపక నవ్వారు. ఈ విధంగా ఆలమందలలో తిరిగే జంగిలి కృష్ణుడు గేలిచేయబడ్డాడు. అల్లరి మూకల పెద్ద రణగొణ ధ్వనితో అడ్డము వచ్చినవారిని ఆటపట్టిస్తూ పరిహాసాలాడి తన మూకలను మెప్పించాడు మీకృష్ణుడు. మీవాడు ఇండ్లలో జొరబడితే ఇంతులందరూ మూకుమ్మడిగా పైనబడితే అవమానం పాలైనాడు. గోపాలకృష్ణుని చూచి అందరూ నవ్వారు. అక్కడే శ్రీవేంకటాద్రి మీద అలమేలుమంగమ్మతో గూడి చేసే దుండగంపు పనులవల్ల ఈ గోపాలకృష్ణుడు దొరయైనాడు.

★ **బందుకులోనాయను** – అవమానించబడ్డాడు ★ **పౌజు** – మూక



హరి సేవకే వేంకటేశముకుటం

సంఖ్య : 257   సంపుటము : 9   పుట: 148   రాగం : సామంతం

**43** **కోడెకాఁడు వీఁడె వీఁడె గోవిందుఁడు**
**కూడె నిద్దరుసతుల గోవిందుఁడు** ॥పల్లవి॥

**గొల్లెతల వలపించె గోవిందుఁడు**
**కొల్లలాడె వెన్నలు గోవిందుఁడు**
**గుల్ల సంకుఁజక్రముల గోవిందుఁడు**
**గొల్లవారింటఁ బెరిగె గోవిందుఁడు** ॥కోడె॥

**కోలచేఁ బసులగాచె గోవిందుఁడు**
**కూలఁగమ్మెఁ గంసుని గోవిందుఁడు**
**గోలయై వేలఁ గొండెత్తి గోవిందుఁడు**
**గూళెపుసతులఁ దెచ్చె గోవిందుఁడు** ॥కోడె॥

**కుందనపు చేలతోడి గోవిందుఁడు**
**గొందులు సందులు దూరె గోవిందుఁడు**
**కుందని శ్రీవెంకటాద్రి గోవిందుఁడు**
**గొందిఁ దోసె నసురల గోవిందుఁడు.** ॥కోడ॥**257**

**భావ పరిమళం :**

అన్నమయ్య వినిపిస్తున్న గోవిందుని భజన నాలకించండి. ఇది అధ్యాత్మ కీర్తనలలో వుండదగ్గ కీర్తనయైనా గొందుల సందుల దూరిన గోవిందుని వుటంకించారు కాబట్టి ఇది శృంగార సంకీర్తన అయినది. కోడెకాడు అంటే విటుడు అని అర్థం. వీడెకోడెకాడు వీడె గోవిందుడు కూడా. ఇదిగో ఈ తిరుపతిలో ఇద్దరి భామల (శ్రీదేవి, భూదేవి) ముద్దుల మగడు గోవిందుడు. ఈ గోవిందుడెటువంటి వాడయ్యా అంటే.. రేపల్లె గొల్లెతలను వలపించినాడు, వెన్నలను కొల్లగొట్టినాడు. కప్పివేయుచున్న శంఖ చక్రాలుగల గోవిందుడితడే. పుట్టినిల్లు నందగోపునిదైనా ముద్దుచేసిన అనేక గొల్లెతల దగ్గర పెరిగిన గోవిందుడితడు (వారందరూ విష్ణువును పెంచే భాగ్యం కోరిన దేవతా స్త్రీలే మరి...) ఈ గోవిందుడు కోల (చిన్నకఱ్ఱ) చేతబట్టి పశువులను కాచినాడు. అతగాడు తన మేనమామ కంసుని కూలద్రోసి కుమ్మి చంపినాడు. ఇంద్రుడు చేసిన రభస వలన గోలయై తన చిటికినవ్రేలిపై కొండెత్తి (గోవర్ధనగిరి నెత్తిపట్టాడు) గోవిందుడు. తనకు చిక్కిన సతులను చేపట్టిన గోవిందుడితడే. బంగారు రంగు బట్ట కట్టిన గోవిందుడితగాడే. వనితలతో సందులు గొందులు దూరిన ఘనత వీనిదే. ఇంతాచేసి యేకోరికాలేని శ్రీవేంకటాద్రి గోవిందుడు ఇతడే. ఇతగాని అవతార కారణమే దుష్ట శిక్షణ అగుటచే అసురులనందరిని నిర్జించినాడు.

★ **గూళెపుసతులు** – తనకు చిక్కిన స్త్రీలు ★ **గొందిదోసె** – మరుగుపరచాడు

సంఖ్య : 527 సంపుటము : 29 పుట: 359 రాగం : ముఖారి

**48 అద్దములోఁ జూచుకోవే అలమేల్మంగా**
**నిద్దపు సింగారాలు నీకే కానవచ్చీని** ॥పల్లవి॥

**మొలక చన్నులమీఁది ముద్దు చంద్రవంకలు**
**తళుకుఁ జెక్కులమీఁది తమలంపు టంట్లు**
**నిలువుఁ దురుముమీఁది నెయ్యపుఁ జేపట్లు**
**బయలు నీ వలపెల్లాఁ బచ్చిసేసెఁగదవే** ॥అద్ద॥

**చిగురుమోవిమీఁది చిన్ని చిన్ని కెంపులు**
**జిగిమించు నొసలిపై చిరుత చెమటలు**
**మొగములో వసివాడు ముసి ముసి నవ్వులు**
**పగటు నీ వలపులు పచ్చిసేసెఁగదవే** ॥అద్ద॥

**చక్కని నీ మేనిమీఁది జవ్వాది కరఁగులు**
**మొక్కలపు కుచ్చులపై మొలనూలి జారులు**
**వెక్కసపు కాఁగిట శ్రీవేంకటేశు కూటములు**
**పక్కన నీ వలపులు పచ్చిసేసెఁగదవే** ॥అద్ద॥**527**

**భావ పరిమళం :**

అలమేలుమంగమ్మపై చెప్పిన సరస శృంగార కీర్తన వినిపిస్తున్నారు అన్నమయ్య. ఆయన ఈ కీర్తనలో దేవి అనుంగు చెలికత్తె. ఓ అలమేలుమంగా! ఒకపరి అద్దములో నిన్ను నీవు చూసుకొనవమ్మా! స్నిగ్ధమైన సింగారములు నీకే కానవచ్చేనమ్మా! దేవీ! నీ లేజన్నులపై ముద్దులొలుకు ఆ నఖచంద్రవంకలెక్కడివమ్మా? నీ తళుకు చెక్కిళ్ళపై ఆ తాంబూలపు మరకలెక్కడివమ్మా. నీ నిలువైన కొప్పుపై సడలింపు చిన్నెలెలా వచ్చినవమ్మా? అయ్యో! అతగాడు నీవలపెల్లా బయలుచేసివేసినాడే. తేఱనిదానివలె చేసినాడు కదమ్మా!! దేవీ! చిగురువంటి నీ అధరముపై చిన్నచిన్న కెంపులవంటి గాట్లేమిటమ్మా? జిగిమించిన నొసటిపై చిఱుచెమటలేల పట్టినవవమ్మా? నీమొగమున కాంతిలేని చిరునవ్వు వెలసినదేమమ్మా? నీ లావణ్యమైన వలపులను అవన్నీ తేఱనిచ్చుటలేదు గదమ్మా! ఓ దేవీ! చక్కని నీ శరీరంపై జవ్వాది కరిగించి అద్దినాము. నాజూకైన కుచ్చెళ్ళపై బిగించిన మొలనూలు సడలినది. శ్రీవేంకటేశ్వరుని దుర్లభమైన సందిట జరిపిన కూటముల పక్కన నీవలపులు తేటనిచ్చినవి గదమ్మా!

★ **వెక్కసపు** – దుర్లభమైన ★ **పగటు** – లావణ్యము





సంఖ్య : 130 సంపుటము : 14 పుట: 74 రాగం : హిజ్జిజి

**45 మతివేళ లేదా మనసు నిలుపరాదా**
**గుతిగానిప్పుడే నన్నుఁ గూడఁగ వలెనా** ॥పల్లవి॥

**చెఱఁగు మాసినదాన సిగ్గువడుచున్నదాన**
**జఱసి సరసమేల సారెనాడేవు**
**చిఱునవ్వుతో నుందాన చెమటచి తడిదాన**
**యెఱుఁగుదువన్నియును యేమి బాఁతి నేను** ॥మతి॥

**చెదరుఁ గురులదాన చేయెత్తి మొక్కేదాన**
**అదనెఱఁగక యేల అంటవచ్చేవు**
**మదమొలికేటిదాన మాటున నుండేదాన**
**యిదివో యిట్టున్నదాన నేమిబాఁతి నేను** ॥మతి॥

**మంచముపైనున్నదాన మతిలో లోఁగేదాన**
**యించుకంతా సిబ్బితిలేకేల కూడేవు**
**మంచి శ్రీవేంకటేశ నీ మనసు చూచినదాన**
**యేంచక నన్నేలితివి యేమిబాఁతి నేను** ॥మతి॥**130**

**భావ పరిమళం :**

ఇది నేను వివరిస్తున్న 1900 వ అన్నమాచార్యులవారి కీర్తన. ఇంతవరకు నా జీవితంలో ఇటువంటి కీర్తన వివరిస్తానని వూహించికూడా వుండను. ఎవరెవరితో యేయేపనులు చేయిస్తాడో ఆ దేవదేవునికి తప్ప నాబోటి అనామకునికి యెలా తెలుస్తుంది? సాధ్యమైనంత నర్మగర్భంగా వివరించక తప్పని పరిస్థితి. మరి ఇదింతే. దేవి స్వామిపై రుసరుసలాడుతున్నది ఎందుకోమరి... ప్రభూ! నీకు వేళాపాళా లేదా? ఆ మాత్రం మనసు నిలుపలేవా? కొంపలు ముంచుకుపోయేట్లు నన్నిప్పుడే కూడగవలెనా? నేను "చెఱగుమాసిన" దాననని గ్రహించలేవా? సిగ్గువడుచుంటిని కదా! దగ్గర చేరి సరసమాడెదనంటావు ఇదేమి బరితెగింపు. నా చిరునవ్వు నీకు సమాచారం చెప్పుటలేదా? చెమటచిత్తడి రోతగానున్నది. నీవన్నియును యెఱుగుదువు కదా! అయినా ఈ భ్రాంతి నీకెందులకు? పోనీ... నేనేమన్నా సమ్మోహనంగా లేనే? నా కురులన్నీ దువ్వకుండా చిందరవందరగున్నాయి. నీకు చేతులెత్తి మొక్కుతాను కాని సమయం సందర్భం లేకుండా అంటవచ్చెదవేల? రజస్వలను దూరమున్నాను. ఇట్లున్నదానిపై యేమి భ్రాంతి ప్రభూ? నులకమంచముపై వున్నదానను. మనస్సు "అడఁగి" నిస్సత్తువుగానున్నది. ఇంచుకంత సిగ్గులేకకూడెదవా? నీవు మంచి శ్రీవేంకటేశ్వరుడవు కదా! నీ మనస్సు నెరిగినదానను. చక్కగా నన్నేలితివి. అయినా యేమి నీ భ్రాంతి?

★ **సిబ్బితి** – సిగ్గు ★ **బాఁతి** – ప్రీతివలన కలిగిన భ్రాంతి

సంఖ్య : 190 సంపుటము : 13 పుట: 114 రాగం : పాడి

**46** **నీతో నేఁ బంత మాడేనా నీదాననే**
**యేతులు చెల్లించుకొంటి వెదురేది నీకు** ॥పల్లవి॥

**యెలయింపుమాటలనే యెక్కుడుగా వలపించి**
**కొలఁదిఁ బెండ్లాడితివి గొల్లెతలను**
**బలిమి రుక్మిణిఁ దెచ్చి పట్టపుదేవులఁ జేసి**
**చలమీదేర్చుకొంటివి సరి లేదు నీకు** ॥నీతో॥

**పైకొని మేనిమీఁది పాయపుమదము చూపి**
**కైకొంటివి మధురలో గంధమాపెను**
**ఆకడఁ బదారువేల నందరిపైఁ దెచ్చుకొని**
**మేకులు మెరసితివి మితి లేదు నీకు** ॥నీతో॥

**దిక్కులెల్లా సాదించి దీమసముతో గెలిచి**
**యెక్కువ రాచకూఁతులనేలితివి**
**యిక్కడ శ్రీవేంకటేశ యిటు నన్నుఁ గూడితివి**
**అక్కర దీరుచుకొంటి వడ్డమేదీ నీకు** ॥నీతో॥**190**

**భావ పరిమళం :**

అన్నమయ్య చెప్పిన ఈ మధుర సంకీర్తననాస్వాదించండి. దేవి శ్రీనివాసునితో రాజీకి వచ్చి యేమని అంటున్నదో వినండి. ప్రభూ! నేను నీతో పంతమాడగలనా. నేనే నీ దానను. నీ ఉద్ధతిని నీవు నిలబెట్టుకొనక మానవు. నీకు త్రిభువనాలలో యెదురుంటుందా స్వామీ? కొంత అమాయకత్వం కొంత జాణతనం వున్న గొల్లెతలను నీమాటలతో పరవశింపజేసి, అధికముగా వలపించుకొంటివి. కోరిన వారిని బెండ్లాడితివి. రాక్షస వివాహం చేసికొన్న ఘనతనూ సాధించితివి. నీ దేవేరి రుక్మిణీదేవిని అట్లె పరిణయమాడి నీ పంతము నెగ్గించుకొంటివి ప్రభూ! మధురలో గంధమాపెను (కంసునికి గంధమునందించే కుబ్జను నీయెలప్రాయపు మదముతో పైకొని నీదానను చేసికొంటివి. ఆ తరువాత నరకాసురుని చెఱనున్న పదియారువేల మంది రాచకన్నెలను దెచ్చుకొని వారి సమ్మతితోనే పెండ్లాడితివి. ఓ శృంగారరాయా! నీకు మితి అనునదియే లేదు ప్రభూ! ఇదిట్లుండగా నీకృష్ణావతారమున నీతల్లియైన దేవకీదేవి కోర్కె మేరకు అష్టమనాయకుడవై ఎనిమిది మందిని (రుక్మిణి, సత్యభామ మొదలైనవారిని) ఉపాయముతో అన్ని దిక్కులు సాధించి తెచ్చుకొని పెండ్లాడితివి. చూస్తుండగానే కలియుగం వచ్చింది. నీ భగవల్లీలకు వక్రభాష్యం చెప్పే దౌర్భాగ్యులు వచ్చి చెలరేగుతున్నారు. ఈ తిరుమలలో శ్రీవేంకటేశ్వరుడవై నాబోటివారిని కూడా చేపట్టి కూడితివి. నీ అక్కర (కాదు... కాదు మా అక్కర) తీర్చుకొంటివి. మా బ్రతుకులకు పరమార్ధం చూపితివి. నీకు అడ్డుయేముంది ప్రభూ!

★ **ఏతులు**– ఉద్ధతి ★ **పాయపు మదము** – యౌవన గర్వము





సంఖ్య : 360 సంపుటము : 14 పుట: 206 రాగం : ఆహిరి

**47** **నీవంటిగుండె లేదు (ని) నిరుమోహి నేఁ గాను**
**కావరించి చూచియింకాఁ గన్నులకాఁకారదు** ॥పల్లవి॥

**నిన్నుఁ బాసి నాకెట్టు నిదుర వచ్చీ నేఁడు.**
**వెన్నెలబాయిటనే వేగింతుఁగాక**
**నిన్న మాపటంత నే నీమీఁద సేసవెట్టి**
**చెన్నలర నింకాను చేతులతడారదు** ॥నీవం॥

**మాట నీతో నాడక మనస్సెట్టుండీరా నాకు**
**తూఁటవిలుతునిఁ గొంత దూరుదుఁగాక**
**మేఁటినై నీతో నేను మేనవావులు దెలిపి**
**నాఁటిన మోవులలోని నవ్వులింకా మానవు** ॥నీవం॥

**మచ్చిక నిన్ను మరిగి మరపెట్టయ్యీర నాకు**
**అచ్చపు నీతో సరస మాడుదుఁ గాక**
**యిచ్చలు శ్రీ వేంకటేశ యిద్దరముఁ గూడి మేని-**
**పచ్చిచెమటలింకవు పై పైనే నాకు** ॥నీవం॥**360**

**భావ పరిమళం :**

అన్నమయ్య వినిపిస్తున్న ఈ శృంగార సంకీర్తనలో నాయిక స్వామితో యేమంటున్నదో చిత్తగించండి. స్వామీ! నీవంటి హృదయం లేని నిర్మోహిని నేనెక్కడా చూడలేదు. నిన్ను యెంతసేపు మదన తాపముతో జూచినా, నాకు కన్నులలో తాపముపశమించులేదు. మరి నీకిటువంటి తాపమేల కలుగుట లేదు? నేడు నిన్ను విడచి నాకన్నులకు కునుకే రాకున్నది. బయట వెన్నెల నన్ను వేగించుచున్నది. నిన్న మాపటి వేళ నేను నీపై అక్షతలు జల్లినాను కదా! ఇంతలో ఇంత జేసితివే ఇంకా చేతుల తడి ఆరనే లేదుకదా? పోనీ నీతో మాటలాడవద్దు అనుకొంటే, నీతో మాటలాడక నేనెట్లుండగలనురా? ఏమీ చేయలేక కొంతసేపు మన్మథుని నిందిస్తాను. నేర్పరిని గనుక నీకూ నాకూ వున్న వావివరుసలు వివరించి మన మేనరికం సంగతి నీకు చెబుతాను. నేనింత చేస్తున్నా నీవు నీ మొలక నవ్వులను మానవు. పైగా ఇంకా చిరునవ్వు చిందిస్తూనేవుంటావు. ప్రభూ! ఇన్నాళ్ళూ నీకు మచ్చికయై నిన్ను మోహించి, నాకు ఈ నాడు మఱుపెట్లా కలుగుతుంది? నీతో సరసమాడనిదే నాకు నిరాశతప్ప యేదీ వుండదు. కోరికలు దీర్చే ఓ శ్రీవేంకటేశ్వరా! మనమిద్దరమూ కూడియున్నాము. ఇక నాకు పచ్చి చెమటలు ఇంకుటకూ అవకాశం లేదు.

★ **తూటవిలుతుడు** – మన్మథుడు ★ **సేసవెట్టి** – అక్షతలుజల్లి

సంఖ్య : 424 సంపుటము : 20 పుట: 283 రాగం : శ్రీరాగం

**52** **మఱవకుమీ మాట మతిలోనను**<br>
**జఱసి నీవేమనినా సమ్మతించేదానను** ॥**పల్లవి**॥

**చింతదీరె నీవు నాపైఁ జేయివేసినయప్పుడే**<br>
**మంతనాన బుజ్జగించ మతివలెనా**<br>
**వింతదాననా నేను విభుఁడవు నీవు నన్ను**<br>
**యెంతసేసినా నట్టె యియ్యకొందుఁగాక** ॥**మఱ**॥

**తనివిఁబొందెను నీవు దగ్గరినయప్పుడే**<br>
**మనసు రంజిల్లఁజేయ మతివలెనా**<br>
**నను నీ వెఱఁగవా నమ్మికిచ్చినవాఁడవు**<br>
**పనిగొన్నయందుకెల్లా పంపుసేతుఁగాక** ॥**మఱ**॥

**మెచ్చితిని నీవు నన్ను మేకొనికూడినప్పుడే**<br>
**మచ్చికలు వచరించ మతివలెనా**<br>
**యిచ్చకుఁడ శ్రీవేంకటేశ నీయిల్లాలను**<br>
**తచ్చివేసినట్టు నిన్ను తగిలుందుఁగాక** ॥**మఱ**॥**424**

**భావ పరిమళం :**

అన్నమయ్య ఆలపిస్తున్న ఈ శృంగార కీర్తనలో నాయిక యేమని స్వామికి విన్నవిస్తున్నదో వినండి. ప్రియా! ఈ మాట నీమతిలోన మరువబోకుము. నాకు దగ్గరై నన్ను నీవేమనినా నాకు సమ్మతమే. ప్రభూ! నీవు నాపై చెయ్యి వేయగానే నాచింతలన్నీ పటాపంచలైపోతాయి. ఆపైన నీవు నన్ను బుజ్జగించి మంతనాలాడవలసిన పనేమి? నీవు నా విభుడవు. నేను నీకు కొత్తదాననా? నీవు నాకు ఇంత ఉపకారము చేస్తే నీకు నన్ను నేను సమర్పించుకోలేనా? ఓ ప్రియతమా! నీవు నాకు దగ్గరైనంతనే తృప్తి జెందితిని. ఆపైన నీవు నా మనస్సును రంజింపచేయవలసిన పనేమి? నన్ను నీవెఱగవా? నీవు నాకు నమ్మిక నిచ్చిన వాడవు గదా! నీకే అవసరమొచ్చినా నన్ను ఆజ్ఞాపించే హక్కు నీకు వున్నది కదా! ప్రియా! నీవు నన్ను ఆక్రమించి కూడినప్పుడే నీవు నా మెప్పు పొందావు. నాపై ఇంత మచ్చిక ప్రసరించవలసిన పనేమి? నా మనోభీష్టమునెఱిగిన ఓ శ్రీవేంకటేశ్వరా! నేను నీ ఇల్లాలిని. సానబట్టిన రత్నమువలె నిన్ను తగిలియుండెదనుగాక!

★ **జఱసి** – దగ్గరై ★ **తచ్చివేసినట్లు** – సానబెట్టినట్లు





సంఖ్య : 262 సంపుటము : 20 పుట: 175 రాగం : శంకరాభరణం

**49** **కన్నెవయసుమీఁదనే ఘనజవ్వనము వచ్చె**<br>
**విన్న కన్న చోటనేల వెరగందేవే** ॥**పల్లవి**॥

**పూచినవెన్నెలనవ్వు పుప్పొడితేనెమాటలు**<br>
**కాచినచన్నులనిమ్మకాయ లవిగో**<br>
**యేచినవసంతకాల మిప్పుడే నీ మేన నిండె**<br>
**చేచేత నిఁకనేల సిగ్గువడేవే** ॥**కన్నె**॥

**కందువచిగురుమోవి కప్పినకన్నులకావి**<br>
**మందపునిట్టూర్పులమంచిగాలి**<br>
**అందపునీమేనిమీఁద నామనికాలము వచ్చె**<br>
**యిందులో నీపతి వచ్చె నేలకొంకేవే** ॥**కన్నె**॥

**పండినపులకపంట పాయపుఁగళలపచ్చి**<br>
**మెండగుబాహులతలు మేరమీరెను**<br>
**నిండి శ్రీవేంకటపతి నిన్నుఁ గూడెఁ దతికాల –**<br>
**మండనే నీమేనఁ దోఁచె ననుమానమేలే** ॥**కన్నె**॥**262**

**భావ పరిమళం :**

అన్నమయ్య వినిపిస్తున్న ఈ సరస శృంగార సంకీర్తనలో ఆయన అమ్మవారి చెలికత్తెయై యేమంటున్నారో ఆలకించండి. దేవీ! ఇదంతా జవ్వనంపు ఘనమైన శోభ, కన్నెవయసు మీద అది వచ్చి చేరితే యేది చూచినా, యేది విన్నా అచ్చెరవొందుతూనే వుంటావు మరి. ఓ దేవీ కన్నె వయసు ప్రభావం చెబుతాను వినవమ్మా! నీ చిరునవ్వులు పూచిన వెన్నెలలవలె వుంటాయి. మాటలు పుప్పొడి తేనెలవలె సుమ మకరందభరితమౌతాయి. వెచ్చని పయోధరములు ఆమ్ల ఫలములౌతాయి. దీనివల్ల నీకేమనిపిస్తున్నది? అతిశయించిన ఆమని నీ శరీరముపై నిండినది. తరుణములో పనికిమాలిన సిగ్గులు దేనికమ్మా? ఓ చెలీ! లే చిగురువంటి పల్లవాధరము విచ్చుట, తమకమున కన్నులు కావిరంగునొందుట, మెల్లని నిట్టూర్పులు పరిమళ పవనములగుట యేమి నిరూపించుచున్నవమ్మా? నీ మేనిమీదన్ ఆమని కాలము వచ్చెనమ్మా! అదిగో, ఇంతలో నీపతికూడా వచ్చుచున్నాడు. ఇంకా నీవు కొంకెదవేలనమ్మా? (సంకోచించెదవేలనమ్మా?) ఓ దేవీ! నీమేనిపై విస్తృతమైన పులకల పంట నీకు ప్రాయంపు కళావైభవము చేకూరినదని చెప్పకనే చెప్పుచున్నది. నీ విభుని బాహులతల అల్లిక అతిశయించినది. నిన్ను కౌగిట నించిన శ్రీవేంకటపతి నిన్ను గూడినాడు. తతికాలమందునే నీ మేనిపై తోచినది. దీనిలో అనుమానమేలేదు.

★ **మేరమీరినది** – అతిశయించినది ★ **తతికాలము** – తగిన సమయము

సంఖ్య : 566 సంపుటము : 23 పుట: రాగం : ముఖారి

**50** చందురుఁడు నుదఇంచె జల్లున వెన్నెలగాసె
చందములు సేసుకొని సమ్మతించరాదా ॥పల్లవి॥

దొరకొనినమాటల దొంతులు నీవు వెట్టఁగ
యెరవుల మారుత్తరా లేమిచ్చేము
తరుణి వాతనికి నాతఁడు నీకు రమణుఁడు
మరిగి నీకోపమెల్ల మానరాదా ఇఁకను ॥చందు॥

యెంచి ఆతనినేరాలే ఇటు వాములువేయఁగ
అంచెల నెందాఁకా నేము ఆడుకొనేము
కాంచ కాతఁడు బాసిచ్చె గురిగా నిలిచితివి
ఇంచుకంత మోవితేనె లియ్యరాదా ఇఁకను ॥చందు॥

కేరడపునవ్వులే కిమ్ముల వెదవెట్టఁగ
సారెసారె నిన్నెట్ల సాదించేము
కోరి శ్రీవేంకటేశుఁడు గూడె నీవు గూడితివి
వూరడై వొక్కుమ్మడి నీవుండరాదా ఇఁకను ॥చందు॥566

**భావ పరిమళం :**

అన్నమయ్య చెప్పిన ఈ మధుర కీర్తనలో ఆయన దేవి చెలికత్తెయై మంచి తరుణము మించిపోవుచున్నది. ఇకనైనా సమ్మతించవమ్మా అని తన యజమానురాలైన శ్రీదేవికి నచ్చచెబుతున్నారు. ఈ కీర్తనలన్నీ దాదాపు ఒకే తీరుగా సాగినా దేని ప్రత్యేకత దానిదే. ఈ పల్లవినే పరిశీలించండి. నీలాకాశంలో చందుడుదయించాడు. పిండిని వెదజల్లినట్లు వెన్నెల విస్తరించింది. ఏదో విధానమవలంభించి ఆమెతో చేరికకు సమ్మతించవయ్యా! నీవాయనపై పూనికతో అన్ని మాటల దొంతరలు చెబుతుంటే మేమేమి మారుత్తరములీయగలమమ్మా? నీవాతని మగనాలివి. ఆతడు నీకు రమణుడు. అంతేకదా? మరి నీకంత మరిగే కోపమేలనమ్మా. ఇంకనైన మానరాదా తల్లీ! దేవీ! ఆతడు పురుషోత్తముడు. నీవు ఆయన నేరాలే, వాములబెట్టేవు (అధికముగా చెబుతున్నావు). అంచెలంచెలుగా మేము మాత్రం యెందాకా ఆదుకొనగలమమ్మా! స్వామి, యేమాత్రం సంకోచించక బాసజేసినాడు కదా! నీవు కూడా నమ్మకంతో నిలిచితివి. మరికనైనా కొద్దిగా నీ అధరామృతమునందించరాదా తల్లీ! నీవిభునికి. అలవోకగా నవ్వుచూ ప్రేమలు నాటుకొనునట్లు చేయాలమ్మా! ప్రతిసారీ నిన్నెట్లా సాధింతుమమ్మా? నీవు నీ కోరిక మేరకే శ్రీవేంకటేశ్వరుని కూడినావు కదా! ఊరట జెంది ఒకటిగా నీవుండరాదా తల్లీ!

★ **కేరడపు నవ్వులు** – అలవోకమందహాసములు ★ **చందములు** – విధములుగ





సంఖ్య : 491 సంపుటము : 23 పుట: 000 రాగం : ఆహిరి

**51** అలిగితినా నీతో అవుఁగాదని యంటినా
తలఁపులో నున్నాఁడవు దయఁజూడరా ॥పల్లవి॥

ఆసలేల పెట్టేవు ఆసలేల రేఁచేవు
మోసమున నున్నదాన ముద్దరాలనే
కానీలేరా నావంటికాంతలు నీకుఁ గలరు
దానికేమి అట్లానే దయఁజూడరా ॥ఆలి॥

చెక్కులేల నొక్కేవు సిగ్గులేల వుట్టించేవు
ఇక్కడనే వున్నదాన హితురాలనే
దిక్కులను మరి నీవు తెచ్చుకొంటి వింతులను
తక్కక నన్నట్లానే దయఁజూడరా ॥ఆలి॥

యేల కాఁగిలించేవు యెంత వొడఁబరచేవు
యీలాగుల నున్నదాన యిల్లాలనై
అలరి శ్రీవేంకటేశ ఆండ్లఁ బెండ్లాడితివి
తాలిమి నన్నట్లానే దయఁజూడరా ॥ఆలి॥491

**భావ పరిమళం :**

అన్నమయ్య చెప్పిన ఈ సరసకీర్తనలో దేవి స్వామిని ప్రాధేయపడుతూ యేమంటున్నదో వినండి. అమ్మవారే స్వయంగా బ్రతిమిలాడుతున్నది. ప్రభూ! నేనేనాడైనా నీతో అలిగితినా? నీవు ఔనన్నదానికి కాదని అన్నానా? నీవెప్పుడు నాతలపుల లోననే వున్నవాడవు. ఇకనైనా నన్ను కనికరించరాదా? స్వామీ! నీపై ఆనలెందుకుపెట్టుకొంటావు? అంతేకాక నాలో లేనిపోని ఆశలెందుకు రేపుతావు? నేను ముగ్ధను. పల్లెత్తుమాట పలుకనైతిని. నీ ధీమసమేమంటే... నాబోటి కాంతలు నీకు 'కో' అంటే కోటిమంది గలరయ్యె. ఉంటేవున్నారులే స్వామీ! కనీసం నన్ను కనికరించవచ్చును కదా? ప్రభూ! నీవు నా చెక్కిలి నొక్కి నన్నేల సిగ్గులలో ముంచెత్తదవు. నేను నీ సమీపముననే వున్నానుకదా! నీ హితురాలనే కదా! నీకోసం అన్ని దిక్కులనుండి అతివలు వస్తారు. నన్ను కూడా వారికివలె మోసగించక నన్నునుగ్రహించరాదా? నాకు తెలియక ఒక మాట అడుగుతాను, నీ కొఱకంతమంది వేచివుంటే, నన్నెందులకు కౌగలించావు? నన్నెందుకంత ఒడబరచేవు. అంత శ్రమ నీకేల ప్రభూ! నీపై లాగువున్నదానను. అదీగాక నీ ఇల్లాలిని. ఓ శ్రీవేంకటేశ్వరా! అలనాడే క్షీరాబ్ధికన్యనైన ఈ శ్రీ మహాలక్ష్మిని పెండ్లాడితివి. అదే క్షమతో నన్ను కనికరించరాదా?

★ **తాలిమి** – క్షమ ★ **తక్కక** – మోసగించక







రచయిత:

## అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు



| | | |
|---|---|---|
| పిలవండి | : | **అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు** |
| పుట్టింది | : | **9-6-1945** |
| చదివింది | : | **ఎం.టెక్.** |
| ఉండేది | : | **ఫ్లాట్ నెం. 5., ప్లాటు నెం. 61,**<br>**సిద్దార్థ అపార్ట్‌మెంట్స్, సిద్ధార్థనగర్.** |
| రంధి | : | **భగవన్నామ సంకీర్తన** |
| నచ్చింది | : | **శాస్త్రీయ సంగీతం** |
| నచ్చంది | : | **నక్కజిత్తులు** |
| మెచ్చింది | : | **సజ్జన సాంగత్యం** |
| రింగండి | : | 00919393021360 |
| చదవండి | : | www.geetadeksha.com |
| ఇవ్వండి | : | e-mail : geetadeksha@gmail.com |


అన్నమయ్య పదవేదం





